నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 10 ఆగష్టు 2024 | www.navatelangana.com

## అందోల్ పెద్దచెరువు కట్ట పనులను వేగవంతం చేయాలి



**నవతెలంగాణ-జోగిపేట**

అందోల్ పెద్దచెరువు కట్టపై కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ శాఖ ఈఈ తిరుపతి కుమార్ కాంట్రాక్టర్‌కు సూచించారు. అందోల్ చెరువు కట్టపై చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు నత్తనడక నడుస్తున్నాయని వేగవంతం చేయాలనిసదరు కాంట్రాక్టర్కు తెలిపారు. కట్ట సైడ్ వాల్ తొందరగా పూర్తి చేయాలని వర్షానికి మట్టి కొట్టుకుపోకుండా చూడాలని తెలిపారు. పిచ్చి మొక్కలను తీసివేయాలన్నారు. పనుల్లో జాప్యం చేయరాదని సూచించారు. ఆయన వెంట డీఈ కృష్ణమోహన్, మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్ తదితరులు ఉన్నారు.

## గిరిధర్‌రెడ్డి ప్రమాణానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**నవతెలంగాణ-జహీరాబాద్**

జహీరాబాద్ మాజీ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి సెట్విన్ చైర్మెన్‌గా ప్రమాణం చేసిన సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తంకు మార్ రెడ్డి, అజారుద్దీన్, నిర్మల జగ్గారెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీమంత్రి జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చంద్రశేఖర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, హనుమంతరావు పాటిల్,న రసింహారెడ్డి, మక్సుద్, రామలింగారెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, జాఫర్, అరుణ్, బాబి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్, కిషన్, జ్యోతి మోహన్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి



**నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్**

డబుల్ బెడ్ రూము ఇండ్లు పేదలకు వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నారాయణ ఖేడ్ నియోజకవర్గంలోని జూకల్ శివారులో డబుల్ బెడ్ రూములు శిథిలావస్థకు చేరాయన్నారు. మరోపక్క పనులు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లు చేతులెత్తేశారని ఆరోపించారు. కాబట్టి పూర్తైన ఇండ్లను అర్హత కలిగిన వారికి పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రమేష్, సంతోష్, మహిపాల్, కాన్సిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఝరాసంగం తహసీల్దార్‌గా తిరుమలరావు



**నవతెలంగాణ-ఝరాసంగం**

ఝరాసంగం నూతన తహసీల్దారుగా ముత్యాల తిరుమలరావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గత నెల 31వ తేదీన సంజీవరావు విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానం ఖాళీగానే ఉండిపోయింది. ఆయన స్థానంలో జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహించిన తిరుమలరావు ఇక్కడ బాధ్యతలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు.

## వీధి కుక్కలను నివారణకు చర్యలు చేపట్టండి




**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఇందిరమ్మకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నారాయణఖే డివిజన్ అధ్యక్షులు మహిపాల్ మాట్లాడుతూ.. మున్సిపాల్టీతో పాటు గ్రామస్థాయిలో కూడా కుక్కలు విపరీతంగా పెరిగిపోయి.. చిన్న పిల్లలు, వృద్ధులపైన దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## వట్‌పల్లి నూతన ఎస్ఐగా లక్ష్మణ్



**నవతెలంగాణ-వట్‌పల్లి**

వట్‌పల్లి నూతన ఎస్ఐగా లక్ష్మణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నెల ముందు సంగారెడ్డి ఎస్బి నుంచి వట్‌పల్లి ఎస్సైగా బదిలీపై వచ్చిన సంగమేశ్వర్.. తన కుమారుని వివాహ నిమిత్తం ఒక నెల సెలవుపై వెళ్లడంతో పటాన్చెరు పీఎస్‌లో ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మన్‌ను వట్‌పల్లికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు తనతో సిబ్బంది కృషి కూడా అవసరమన్నారు.

## వాహనం బోల్తా పడి.. ఆవు మృత్యువాత



**నవతెలంగాణ-మనూర్**

పశువులను మార్కెట్‌కు తరలిస్తున్న వాహనం బోల్తా పడి.. ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని బెల్లాపూర్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పశువులను విక్రయించేందుకు నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ మార్కెట్‌కు టీఎస్31టీ5401 అనే నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో బెల్లాపూర్ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమా దంలో అందులో ఒక ఆవు పైన వాహనం పడి అక్కడ కి అక్కడే మృతి చెందిన్నట్లు వారు తెలిపారు. డ్రైవర్ సమాచారం తో పశువుల యజమాని వేరే వాహనం లో మిగిలిన పశువులు వేసుకొని వెళ్ళిపోయాడు అని పేర్కొన్నారు. స్థానిక పోలీసలకు సమాచారం తెలిపారు.డ్రైవర్ లేక వాహనం ఎవరిది పశువుల యజమాని ఎవరు సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వాహనం స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్ కు తరలించారు అని వారు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి బీజెపి నాయకులు సాయిరాం వెళ్లిప్రమాదం జరిగిన విషయం పైస్థానికులను అడిగి తెలుసు కున్నారు.

ఘటన స్థలానికి విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ కార్యకర్తలు పరిశీలించారు. కాగా పశువులను తరలిస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సాయిరాం ఈశ్వారప్ప, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి వాయు ప్రతిష్ట



**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

ఎల్లమ్మ తల్లి వాయు ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీ వనపర్తి నగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు అబ్దుల్ బషీర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా స్వచ్ఛదనం పనులు



**నవతెలంగాణ-న్యాల్‌కల్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం మండలంలో మాత్రం మొక్కుబడిగా సాగుతున్నది. మండల అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో సరిగా లేకపోవడంతో.. పారిశుధ్యం ఎప్పటిలాగానే పడకేసిందని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యం, చెత్త తొలగింపు, స్వచ్ఛతా కార్యక్రమాలు నామమాత్రంగా చేస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లా అధికారులు సందర్శించిన గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నదని.. మురుగునీరు, అపరిశుభ్రతే దర్శనమిస్తున్నదన్నారు.

## హెూటల్‌లో మద్యం స్వాధీనం

**నవతెలంగాణ-జోగిపేట**

మండల పరిధిలోని ఎర్రారం గ్రామ శివారులోని నేషనల్ హైవే పక్కన టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకొని బెల్టు షాపు నడుపుతున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ అనీల్‌కుమార్ తెలిపారు. బెల్టుషాపుల నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలతో శుక్రవారం సీఐ అనీల్‌కుమార్, ఎస్ఐ-2 మొగులయ్య, ఏఎస్ఐ గౌసొద్దిన్‌లు శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు దాడి జరిపారు. షాపులో 26 బీర్లు, 8 ఆఫ్ బాటిల్‌లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని.. హెూటళ్లు, దాబాలల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## ఎర్రారంలో 12 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

**నవతెలంగాణ-జోగిపేట**

మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి జోగిపేట కోర్టుకు రిమాండ్‌కు పంపినట్టు జోగిపేట సీఐ అనీల్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9వేల నగదు, పది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు... 'ప్రహారి క్లబ్స్' పునాదులు



- మత్తు వదిలించే ముందస్తు ఎత్తు
- కమిటీల ద్వారా మాదక ద్రవ్యాల నిర్మూలనా కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ప్రహారీ క్లబ్‌ల ఏర్పాటు
- వాటిని నడిపి పర్యవేక్షిస్తే మంచి ఫలితాలు
- మూడు జిల్లాల్లో డ్రగ్స్‌పై పెరిగిన పోకస్
- అందరి భాగస్వామ్యముండాలి: ఎస్పీ

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

డ్రగ్స్ నిర్మూలనలో 'ప్రహారి క్లబ్‌లు' పునాదులు కానున్నాయి. ఉన్నత పాఠశాల స్థాయిలో సంపూర్ణమైన అవగాహన కల్గించడం ద్వారా భవిషత్‌లో డ్రగ్స్ వైపు మళ్లే ప్రమాదముండదు. అందుకే ప్రహారి క్లబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1281 స్కూల్స్ ఉండగా ఇందులో 217 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 78124 మంది విద్యార్థులున్నారు. సిద్దిపేట జిల్లాలో 941 పాఠశాలలుండగా వాటిల్లో 227 ఉన్నత పాఠశాలల్లో 85291 మంది మెదక్ జిల్లాలోని 146 ఉన్నత పాఠశాల్లో 42100 మంది విద్యార్థులున్నారు. ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో మాద ద్రవ్యాల నిర్మూన గురించి అవగహనా పెంచడం ద్వారా కళాశాల విద్యార్థులుగా మారాక కూడా డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండే అవకాశముంది. అందుకే ఉన్నత పాఠశాల్లో 6 నుంచి పదో తరగతి విద్యార్థుల్ని చైతన్య పరిచేందుకే స్కూల్స్‌లో ప్రహారీ క్లబ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో స్కూల్స్‌లో వేసే కమిటీకి చైర్మన్‌గా ప్రధానోపాధ్యాయులు, వైస్ చైర్మన్‌గా సీనియర్ ఉపాధ్యాయులుంటారు. అదే విధంగా 6-10 తరగతి వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు, స్థానిక పోలీస్, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒకరు చొప్పున కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై చేపట్టాల్సి కార్యక్రమాల్ని చర్చిస్తుంది. కమిటీలో ఉన్న విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన గురించి అవగహనా కల్పిస్తారు. ఆ విద్యార్థులు తోటి విద్యార్థులకు అవగహనా కల్పిస్తారు. ఇలా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ పాటు తల్లిదండ్రులు కూడా డ్రగ్స్ నియంత్రణలో భాగస్వామ్యం కానున్నారు. అయితే కమిటీ వేసి వదిలేస్తే ఫలితాలు రావు. వాటిని రెగ్యులర్‌గా పనిచేయించి పర్యవేక్షించాలి. అలాగే యువజన, విద్యార్థి, సామాజిక, పౌర సంఘాల్ని కూడా భాగస్వామ్యం చేయడం ద్వారా పల్లె, పట్టణాల్లో సైతం డ్రగ్స్ మహమ్మారిని పారదోలేవీలుంది.

> మాదక ద్రవ్యాలకు అలవాటు పడి చిత్తవుతున్న యువత, విద్యార్థులు, కార్మికుల మత్తును వదిలించేందుకు అధికార యంత్రాంగం వేసిన ఎత్తులు ఫలితాలిచ్చే అవకాశముంది. విద్యాలయాలు, పారిశ్రామిక వాడలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. ఉన్నత పాఠశాలల్లో ప్రహారీ క్లబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా, విక్రయాలు, సేవించే స్థావరాలపై నిరంతర నిఘా కొనసాగుతోంది. అయినా మూడు జిల్లాల్లోనూ గంజాయి, డ్రగ్స్ రవాణా జోరు తగ్గట్లేదు. లోగుట్టు విక్రయాల దందా ఆగట్లేదు. విస్తృతమైన అవగహనా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. విద్యార్థులు, కార్మికులు, యువతతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కంపెనీ యజమాన్యాలు యావత్ పౌర సమాజాన్ని సమన్వయం చేయాలి.

### అక్రమ రవాణాపై పెంచిన నిఘా

గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై నిఘా పెంచారు. హైదరాబాద్-పూణే, హైదరబాద్-నాందేడ్‌తో పాటు రాజీవ్ రహదారిపై అనేక స్థావరాలున్నాయి. గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయాలు సాగుతున్నాయి. హోటళ్లు, దాబాలు, టీ కొట్టులు, కిరాణం షాపుల్లో విక్రయాలు సాగుతున్నాయి. లారీలు, ఇతర వాహనాలు నిలిపే చోట డ్రైవర్స్ సరుకు తెచ్చి అంటగడుతున్నారు. జహీరాబాద్ గంజాయి రవాణాకు గేటీవేగా మారింది. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సరుకు విచ్చలవిడిగా రవాణా అవుతోంది. రహదారులతో పాటు రైల్వే మార్గంలోనూ గంజాయి, ఇతర డ్రగ్స్ రవాణా సాగుతుంది. కాచిగూడ నుంచి మెదక్ జిలా మీదుగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, హరియాణా వరకు రైలు మార్గముంది. ఈ రూట్‌పై ప్రత్యేక నిరంతర తనిఖీలు పెంచారు. కంకోల్ టోల్‌ప్లాజ వద్ద నిఘ వల్ల ఫలితం కనిపిస్తుంది.

### చాక్లెట్స్, హాష్ అయిల్ రూపంలో

గంజాయిని వివిధ రూపాల్లో విక్రయిస్తున్నారు. ఎండు గంగాయితో పాటు గంజాయి ఆకులతో హష్ అయిల్ తయారు చేస్తున్నారు. చాక్లెట్స్, అయిల్ రూపంలో గంజాయిని అంటగడుతున్నారు. గంజాయి చాక్లెట్స్‌ను విద్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమలున్న ప్రాంతాల్లోని కిరాణం, టీ కొట్టులు, పాస్ట్‌పుడ్ సెంటర్స్‌ల్లో విక్రయిస్తున్నారు. చాక్లెట్స్‌ను గంజాయిగా బావించే అవకాశంలేదు. దీంతో ఆ రూపంలో సేల్ చేస్తున్నారు. అలాగే గంజాయి ఆకులతో హష్ అయిల్ కూడా తయారు చేస్తున్నారు. లీటర్ అయిల్ ధర లక్ష నుంచి లక్షన్నర వరకు పలుకుతుంది. లీటర్ గంజాయి అయిల్ విక్రయించడం తేలికవుతుంది. రకరకాల చాక్లెట్స్, అయిల్స్ ఉన్నందున వాటిల్లో గంజాయితో తయారు చేసిన సరుకేదనేది పసిగట్టేందుకు ప్రత్యేక బృందాల్ని పెట్టారు. మత్తు చాక్లెట్స్, అయిత్ విక్రయించే, సేవించే స్థావరాలపై పోలీసులు కన్ను వేయడంతో విక్రయదారులు భయపడుతున్నారు.

### విద్యాలయాలు, పరిశ్రామిక ప్రాంతాల్లో గట్టి నిఘా

గంజాయి ఇతర డ్రగ్స్ విక్రయాల విద్యాలయాలు, పరిశ్రమలున్న ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. పారిశ్రామిక వాడలుగా ఉన్న పటాన్‌చెరు, జిన్నారం, బొల్లారం, సంగారెడ్డి, జహీరాబాద్, కొండాపూర్, హత్నూర, గుమ్మడిదల, మనోహరబాద్, తూప్రాన్, చేగుంట, చిన్న శంకరంపేట, శివంపేట, గజ్వేల్, మర్కుక్, ములుగు వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో వేలాది పరిశ్రమలున్నాయి. బీహార్, రాజస్థాన్, గుజరాత్, యూపీ, ఝార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చి లక్షలాది మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ ప్రాంతాల్లోనూ అవగహనా పెంచే కార్యక్రమాలు చేపట్టాలి. కంపెనీల్లో పనిచేసే కార్మికుల ప్రవర్తన, ఆరోగ్య పరిస్థితిపై నిఘా పెట్టి అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని కౌన్సింగ్ ఇప్పించాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్ చేర వేసే లింక్‌ను తెంచేలా నిఘా పెట్టారు. విద్యార్థుల్లో కొంత భయం ఏర్పడింది.

### అందరి భాగస్వామ్యముండాలి

**రూపేష్, ఎస్పీ సంగారెడ్డి**

డ్రగ్స్ నిర్మూనలలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలి. అందరూ బాధ్యతగా ఫీలవ్వాలి. మాదక ద్రవ్యాల్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ అప్రమత్తతో పనిచేస్తుంది. డ్రగ్స్ ఆనవాళ్లపై సమాచారం అందించాలి. మరింత నిఘా పెట్టాం. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, యువజన సంఘాలు సైతం అవగహనా కార్యక్రమాలు నిర్వహించాలి. సమిష్టి కృషితో మాత్రమే డ్రగ్స్‌ను అరికట్టగలం.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమిస్తాం

**కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక,కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం**

**కార్మిక, సంఘాల పిలుపు**










**నవతెలంగాణ-సంగారెడ్డి/మెదక్ టౌన్ /కౌడిపల్లి/ సిద్దిపేట రూరల్**

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపుమేరకు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఐఎన్ టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు జయరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నర్సింలు మాట్లాడారు. అదేవిధంగా మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద ఐద్వా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో, కౌడిపల్లి బస్టాండ్ వద్ద ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి బసవరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌లు, కౌడిపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మలు పాల్గొని మాట్లాడారు.సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట రూరల్ మండలం నారాయణకావుపేటలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్ పాల్గొని మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం అని వారు పిలుపునిచ్చారు. 1942 ఆగస్టు 9న ఈ దేశాన్ని వదిలి వెళ్ళండి అని తెల్లదొరలను హెచ్చరించినట్టు గుర్తు చేశారు. కాగా నేడు నరేంద్ర మోడీ.. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్రాన్ని, స్వాలంబనను తాకట్టు పెడుతున్న దన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు మోడీ ప్రభు త్వం సాగిల పడుతున్నదని మండిపడ్డారు. ఎందరో త్యాగద నులు, పోరాటయోధుల ప్రాణ త్యాగాలతో సిద్ధించిన స్వతంత్రాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని మండి పడ్డారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన వెంటనే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన నయా వుదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించడానికి వందరోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నదన్నారు. లేబర్ కోడ్లను నోటిఫై చేయడం, భారతీయ న్యాయ సంహిత 2023ను అమలు చేయడం, నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ ద్వారా పెద్ద కార్పొరేట్లకు ఆర్థిక వెసులుబాట్లు కల్పించే చర్యలు వేగవంతం చేసిందన్నారు. మూడోసారి అధికారం లో వచ్చిన 20 రోజుల్లోనే మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎనిమిది మంది మైనార్టీ మతస్తుల మీద మూకదాడులుకు దిగడం ద్వారా ఆర్ఎస్ఎస్ దాని హిందుత్వ మత శక్తులు తమ మత విద్వేష కార్యక్రమాన్ని కొనసాగిస్తామని హెచ్చరిక చేశాయన్నారు. సామాన్యులకు మాటల్లో, సంపన్నులు ,కార్పొరేట్లకు మూటలు వడ్డించే విధంగా మోడీ ప్రభుత్వం కేంద్రంలో బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు. అత్యంత కీలకమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగానికి ఈ బడ్జెట్ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కానీ అన్ని రంగాల్లో కార్పొరేట్లకే పెద్దపీట దక్కిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణలో భాగంగా సింగరేణి 61 బ్లాక్‌లను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించిందన్నారు. ఇక్కడి ఓట్లతో తెలంగాణ నుంచి పార్లమెంటుకు వెళ్లిన కిషన్ రెడ్డి బొగ్గు బ్లాక్‌ల మంత్రిగా ఉండి తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ని శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను వేలంపాట పాడటం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. దేశంలోని అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ. 10000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజయ్య, ప్రవీణ్, నాగేశ్వరరావు, బాబురావు,దత్తు, కృష్ణమూర్తి, రాజు, శివ,గోపాల్‌రెడ్డి, నరసింహులు ఆలీ రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మెదక్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు కొమురయ్య సత్యం, షౌకత్, అజయ్ బాబు, సిద్దు,లు పాల్గొనగా, కౌడిపల్లిలో జరిగిన నిరసన ప్రదర్శనలో కుమార్,రాజు, నారాయణరావుపేటలో నిర్వహించిన నిరసన పప్రదర్శనలో సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు..

**నవతెలంగాణ-వట్‌పల్లి**

పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు జరిపి పలువరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన గురువారం సాయంత్రంమండలంలోని ఖాదీరబాద్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బర్రెల షెడ్డులో పేకాట ఆడుతున్నట్టు నమ్మదగిన సమా చారం మేరకు ఏఎస్ఐ విట్టల్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన మాజీ సర్పం చ్ తనయుడు, మరికొందరు షెడ్డులోనికి వచ్చి.. షెడ్డులోనికి వచ్చి ఏ అధికారంతో అరెస్టు చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. అయితే కొత్త చట్టాల ప్రకారం పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను ప్రోత్సహించడం కూడా నేరమేనని.. ఉపాధ్యాయు డిగా ఉండి బర్రెల షెడ్డులో పేకాటను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారని అవసరమైతే వారిపై కూడా కూడా కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. కాగా పేకాట రాయుళ్ల నుంచి ఆరు సెల్ఫోన్లను, రూ.1400 స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

## మొక్కలు నాటిన మంత్రి పొన్నం



**నవతెలంగాణ-అక్కన్నపేట**

వన మహెూత్సవంలో భాగంగా స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అక్కన్నపేట మండలం పోతారం (జె) గ్రామంలో శుక్రవారం అధికారులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన మహెూత్సవ కార్యక్రమంలో కూడా తాటి, ఈత మొక్కలను నాటవచ్చన్నారు. కులవృత్తి ఆధారంగా జీవనం సాగించేలా కుమ్మర్లు, వడ్రంగి, కులవృత్తులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. వీటికే కాకుండా అన్ని కులవృత్తులకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని తెలిపారు. త్వరలోనే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టు ప్రాజెక్టు ద్వారా నీరు వస్తాయని, భూ నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎక్సైజ్, డిఆర్డిఏ ఇతర అధికారులకు, గౌడ సంఘానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ అధికారి మహేష్, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి, ఏసిపి వాసాల సతీష్, ఎక్సైజ్ సీఐ పవన్, తహశీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం నాయక్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ స్కూళ్ల టైం టేబుల్ సవరించాలి

**ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి**

**యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు**



**నవతెలంగాణ-సంగారెడ్డి**

రెసిడెన్షియల్ స్కూళ్ల టైం టేబుల్ సవరించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి, కంది మండలాల్లోని పలు రెసిడెన్షియల్ పాఠశాలలను, కేజీబీవీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్స్, మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియన్స్, ఇతర అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉచిత వైద్యం కల్పించడానికి హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా అన్ని మేనేజ్మెంట్ల పాఠశాలలకు ఒకే రకమైన టైం టేబుల్‌ని ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పలు మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. దాంట్లో ముఖ్యంగా విద్యాంస్థలకు ఉదయం 8 నుంచి 11:30 వరకు షార్ట్ బ్రేక్ లేకుండా 4 పీరియడ్లు నిర్వహించబడుతున్నాయన్నారు. మధ్యలో షార్ట్ బ్రేక్ ఇవ్వాలని, అదేవిధంగా సాయంత్రం డిన్నర్ 6 గంటలకు కాకుండా 7:30 గంటలకు పెట్టాలని ఆ మేరకు ఇచ్చిన టైం టేబుల్‌లో మార్పు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో నైట్ డ్యూటీస్ సమయం 9 గంటల వరకు ఉండడంతో నైట్ డ్యూటీ చేసిన మహిళా ఉపాధ్యాయులు తిరిగి ఇంటికి ఆ రాత్రి వెళ్లడం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. కేర్టేకర్స్ నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు బకాయి పడిన 4 డీఏలు ఇవ్వాన్నారు. పీఆర్సి నివేదికను బహిర్గత పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పి. నరేందర్, ధనరాజ్ మరియు ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఏలను వెంటనే ప్రకటించాలి

- తపస్ రాష్ట్ర సహకోశాధికారి భాస్కర్ దేశ్




**నవతెలంగాణ-సంగారెడ్డి**

రాష్ట్ర పప్రభుత్వం పెండింగ్ డీఏలను వెంటనే పప్రకటించిలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహకోశాధికారి భాస్కర్ దేశ్ డిమాండ్ చేశారు. తపస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన భాస్కర్ దేశ్ మాట్లాడుతూ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎనిమిది నెలల కాలంలో ఇంతవరకు ఒక్క డిఏ కూడా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. సుమారుగా ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయని, వాటిలో కనీసం నాలుగు డిఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా గత సంవత్సరం జూలైతో పిఆర్సి గడువు ముగిసినందున కొత్త పిఆర్సి కమిటీ నుంచి వెంటనే నివేదికను తెప్పించుకొని 50 శాతం ఫిట్మెంట్‌తో వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు దత్తాత్రి మాట్లాడుతూ మల్టిజోన్-2 పరిధిలో ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలు తొందరగా ప్రమోషన్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలను ప్రమోషన్లను నిర్వహించాలన్నారు. గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, కేజీబీవీలలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను బదిలీల ద్వారా చేపట్టిన తర్వాత కొత్త నియామకం చేయాలన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమం టైమ్ స్కేల్‌ని కల్పించాలన్నారు. ప్రస్తుతం గురుకులాల టైం టేబుల్‌ని మార్చి 9 గంటలకు పాఠశాలలు ప్రారంభమయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బస్వరాజు, జిల్లా నాయకులు నర్సింలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం డివిజన్‌లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం డివిజన్‌లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం ఆకస్మిక పర్యటన చేశారు. గ్రామ పంచాయితీ నిధులతో గతంలో నిర్మించిన శ్రీనివాసనగర్‌కాలనీ, ఐదుగుళ్ల పోచమ్మ దేవాలయం ఆవరణంలో ఉన్న ఎంపీపీఎస్ స్కూల్‌ను కార్పొరేటర్ పుష్ప నాగేష్‌తో కలిసి పరిశీలించారు. సుమారు 150 మంది విద్యార్థులతో నడుస్తున్న ఆ పాఠశాల శిథిలావస్థలో ఉన్నదని.. అభివృద్ధి కోసం కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నూతన పాఠశాల భవనం నిర్మించడానికి నిధులు మంజూరు అయ్యే విదంగా చూస్తా అని కలెక్టర్ తెలి పారు. అనంతరం రామచంద్రాపురంలో ఉన్న పలు సమస్యలను కార్పొరేటర్ కలెక్టర్ దృష్టికి తీసుకు చ్చారు. ఈ కార్యక్రమంలో ఉప మిషనరీ సురేష్, ఎస్ఎస్ వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ఏఈ ప్రభు, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన జిన్నారం కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని శివానగర్ నుంచి కంజర్ల వరకు గల రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రత్యేకంగా కలిసి విన్నవించారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ.. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిన్నారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ జిన్నారం మండల మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిన్ ఫ్యూయల్స్‌పై గీతమ్‌లో అంతర్జాతీయ సదస్సు

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అతిథ్యంలో ఈనెల 19-20 తేదీల్లో 'ఇంటర్నేషనల్ సిన్ ఫ్యూయల్స్ కాన్ఫరెన్స్' (ఐఎస్ఎఫ్-2024) పేరిట రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సదస్సు చైర్ డాక్టర్ ఎం.గణపతి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. 'శక్తి పరివర్తన కోసం న్యూక్లియర్, హైడ్రోజన్ల ఏకీకరణ' ప్రధాన ఇతివృత్తంగా, న్యూక్లియర్ హైడ్రోజన్ సంబంధం ఉన్న అవకాశాలు, సవాళ్లను చర్చించడానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోట చేర్చడం లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మానవాళికి స్వచ్ఛమైన గాలి, నీటి వంటి ప్రాథమిక అవసరాలను పరిష్కరిస్తూ భారతదేశంలో స్థిరమైన హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థ కోసం సమగ్ర విధానాన్ని రూపొందించడానికి ఈ సదస్సు ప్రయతిస్తున్నదన్నారు. ప్రపంచ జనాభా ఆరోగ్యం, శ్రేయస్సులు స్వచ్ఛమైన గాలి, నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయనే నమ్మకంతో దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ గణపతి తెలిపారు. ఆర్థిక సౌలభ్యంతో పాటు అధిక సాంద్రత కలిగిన అణుశక్తి ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన అన్ని లక్షణాలను కలిగి ఉందన్నారు. బొగ్గు, శిలాజ ఇంధనాల నుంచి నిర్బంధించబడని కార్బన్ ఉద్గారాలను ఆర్థికంగా లాభదాయక పద్ధతిలో నిర్మూ లించడానికి కృషి, చేయడంపై ఈ సదస్సు దృష్టి సారిస్తుందని తెలిపారు.నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీ.కె. సారస్వత్, బాబా అణు పరిశోధనా సంస్థ (బార్క్) డైరెక్టర్ వివేక్ భాసిన్ వంటి విశిష్ట వక్తలు ఈ సదస్సులో పాల్గొని, పునరుత్పాదక ఇంధనం, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, వికసిత్ భారత్, 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించడంతో పాటు, ప్రతిష్టాత్మకమైన పునరుత్పాదక ఇంధన లక్ష్యాల వంటి క్లిష్టమైన అంశాలపై వారు చర్చలు జరుపుతారన్నారు. మరి న్ని వివరాల కోసం ప్రొఫెసర్ కె.వేదవతి 988 590 3210ని సంప్రదించాలని, లేదా Isfc2024 @ gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

## అధికారులు విధిగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' నిర్వహించాలి

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారుల ందరూ విధిగా నిర్వహించి.. విజయవంతం చేయాలని డీపీఓ అమృత పిలుపునిచ్చారు. మండలంలోని శకాపూర్, అల్గోల్, మల్చల్మ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో భాగంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీల్లో హెల్త్ డిపార్ట్మెంట్ అంగన్వాడీ, స్వయం సంఘాల మహిళలతో కలిసి చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జీపీ స్పెషలాఫీసర్, తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు మండలం, పటాన్ చెరు డివిజన్, రామచంద్రాపురం మండలాలకు చెందిన 271 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద మంజూరైన రూ.2.71 కోట్ల విలువైన చెక్కులను స్థానిక క్యాంపు కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. నిరుపేద ప్రజలకు ఆడపిల్ల పెండ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో ఈ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎమ్మార్వోలు రంగారావు, సంగ్రం, లబ్దిదారులు.

## ఎంగేజ్మెంట్ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



మండలంలోని మసాన్‌పల్లి గ్రామానికి చెందిన కొర్ల కృష్ణారెడ్డి కూతురి ఎంగేజ్మెంట్ వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొని.. నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఆత్మ చైర్మెన్ దిలీప్ కుమార్, పార్టీ మాజీ మండలాధ్యక్షులు సాయిరెడ్డి, నాయకులు అంజిరెడ్డి, దత్తు రెడ్డి, కృష్ణ గౌడ్, ప్రభాకర్, విట్టల్ రెడ్డి, పోచయ్య, సంతోష్, అంజిరెడ్డి, అశోక్, పండరి, చంద్రమోహన్, సాయిలు, తదితరులు, పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఆగస్టు 12న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకిదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ బ్రాంచ్లో ఎన్ని సీట్లు ఉన్నాయో నోటీస్ బోర్డ్‌లో పెట్టినట్టు తెలిపారు. పాలిసెట్ రాసిన అభ్యర్థులకు మొదటి ప్రాధ్యాన్యత ఇస్తామన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌కు వచ్చేవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, పాలిటెక్నిక్-2024 ప్రవేశ పరీక్ష ర్యాంక్ కార్డ్, పదో తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్స్, బదిలీ ధ్రువపత్రం కులం సర్టిఫికెట్‌తో పాటు అడ్మిషన్ కొరకు ప్రెసిడెంట్ సర్టిఫికెట్ కూడా ఉండాలన్నారు. అడ్మిషన్ పొందే కోర్సుకు సరిపోను ఫీజు వెంట తీసుకొని రావాలని కోరారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవి కుమార్ యాదవ్



నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన రవికుమార్ యాదవ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా రవికుమార్ యాదవ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శితోపాటు సిద్దిపేట జిల్లా సహాయ ఇంచార్జిగా రవికుమార్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ అభివృద్ధి, ప్రతిష్టకు అందరి సహాయ సహకారాలతో కృషి చేస్తానన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతల పట్ల సహకరించిన బీజేపీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

నవతెలంగాణ-చౌటకూర్



మండల వ్యాప్తంగా నాగుల చవితి పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చౌటకూర్ మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన నాగదేవత విగ్రహ మూర్తులకు పాలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లి నాగదేవతలకు పాలు పోసి జొన్న ప్యాలాలు, నైవేద్యాలు పెడుతూ మొక్కులు తీర్చుకున్నారు.



**పుల్కల్ :** మహిళలు ఉదయాన్నే పుట్టల వద్దకు వెళ్లి.. పాలు పోసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం రైతులు పచ్చని పంటలతో కళకళలాడాలని.. పంట పొలాల వద్ద రైతులకు విష సర్పాలు ఎలాంటి హాని కలిగించవద్దని వేడుకున్నారు.

**జిన్నారం :** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో పిల్లలు మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చెట్లను పెంచాలి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



'చెట్లను పెంచాలి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి' అని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నారాయణ్‌ఖేడ్ పట్టణంలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహ సముదాయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లోని వంటశాల గదులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిశుభ్రత విషయంలో ప్రమాణాలు పాటించాలని హాస్టల వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్.అశోక్ చక్రవర్తి, స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌రావు,నారాయణ్ ఖెడ్ మున్సిపాలిటీ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, కౌన్సిలర్‌లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు..

**మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ..**

నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఖేడ్ మున్సిపాల్టీని సందర్శించారు. కాగా ఆగస్టు 15ను పురస్క రించుకొని ముందుగానే మున్సిపల్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మెన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహన్, నర్సింలు, మాజీద్, నాయకులు రామకృష్ణ, హన్మడ్లు తదితరులు ఉన్నారు.

## చెట్లే ప్రగతికి మెట్లు

నవతెలంగాణ-ఝరాసంగం



భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందించడానికి చెట్లు ఎంతో ఆవశ్యమని.. చెట్లు ప్రగతికి మెట్లు అని ఎమ్మెల్యే మాణిక్‌రావు అభివర్ణించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్ ఆవరణలో వన మహోత్సవంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. హాస్టల్ ఆవరణలో మండల పత్రిక అధికారి ఐనిష్, ఎంపీడీవో సుధాకర్, హాస్టల్ వార్డెన్ శారదతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళికి ఆక్సిజన్ అందించడంలో చెట్లు ఎంతో దోహదపడుతున్నాయని అలాంటి ఆక్సిజన్ అందించే చెట్లను వేపుగా పెంచి వనాలను నిర్మించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవి ష్యత్తులో మంచి ఉద్యోగాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజ్ కుమార్, పంచా యతీ కార్యదర్శి సరస్వతి, ఐకెపి అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**కేతకిలో ప్రత్యేక పూజలు..**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలోఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంతకాలంగా అనారో గ్యంతో బాధపడుతూ కోరుకున్న నేపథ్యంలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్ర మంలో పాల్గొన్నారు. 37మంది లబ్దిదారులకు రూ.11,9500 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే నివాసంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ జనరల్ సెక్రెటరీ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దీపక్ రెడ్డి, షారుఖాన్, కిషన్ నాయక్, ఆకాశరావు, పవన్, గిరిధర్ చోహన్, నవీన్ రెడ్డి, ఆరిఫ్, పాండు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జిన్నారం :** మండల కేంద్రమైన జిన్నారంలో జాతీయ యువజన కాంగ్రెస్ ఆర్భావ దినోత్సవ వేడుకలను జిన్నారం మండల యువజన కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ సారథ్యంలో ఉత్సాహంగా యువజన కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్ గౌడ్, జానకంపేట సురేష్, ఆది ఎల్లయ్య, జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, విష్ణుమూర్తి చారి, పెద్దమ్మగూడెం శివకుమార్, మంగంపేట గణేష్ కొర్లకుంట జానకంపేట రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లకత్వ లో మొక్కలు నాటిన యువకులు

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో శుక్రవారం స్థానిక యువకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. సందర్భంగా స్థానిక యువ నాయకుడు జింక గణేష్ మాట్లాడుతూ.. సామాజిక పరమైన కార్యక్రమాలలో యువత ముందు వరుసలో ఉండాలని సూచించారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను కూడా ఈ సందర్భంగా గణేష్ బృందం నిర్వహించారు.

## ముమ్మరంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నవతెలంగాణ-వట్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ముమర్మరంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు మొక్కలు నాటారు.

వట్‌పల్లి మండలంలోని మేడికుంద గ్రామంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదన-పచ్చదనం కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఎంపీడీవో శశి ప్రభ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలోని పశువుల సంతలో 26 సర్వే నంబర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో పరిశుభ్రతా, పరిసరాలపై ఆయా గ్రామాలకు చెందిన ప్రత్యేక అధికారులు, ఎంపీఓ, ఎంపీడీవో పర్యవే క్షించాలన్నారు. వర్షాకాలంలో అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాప్తి చెంది.. విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని, ఇప్పటికే పలు గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి విస్తరించిందన్నారు. కాబట్టి మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని.. పిచ్చిగడిపై క్రిమిసంహారక మందులను వినియోగించాలని ఎంపీడీవోకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీ ల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ షంబిరెడ్డి, సంబంధిత కార్యదర్శులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ :** స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ జక్కుల హనుమంతు పోలీస్ సిబ్బంది, యువకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సుధాకర్, సామయ్య, యువకులు జితేందర్ తదితరులున్నారు.

**జోగిపేట :** మండల పరిధిలోని అక్సన్పల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి సంగమేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని తాజా మాజీ జెడ్పీటీసీ, రాష్ట్ర జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షులు ఖాదీరాబాద్ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది పిచ్చి మొక్కల తొలగింపు, చెత్తాచెదారం తొలగింపు, మురికి కాలువల శుభ్రం వంటి కార్యక్రమాలు చేయడం శుభపరిణామమన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అందరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

**మనూర్ :** మనూర్, నాగలిగిద్ద మండలాల పరిదిలో గల గ్రామాల్లో పరిశుభ్రత పనులు జోరుగా జరుగుతున్నాయి. గ్రామంలోని మురుకి కాలువలు, మంచినీటి ట్యాంకులు శుభ్ర చేయడం, బ్లీచింగ్ చల్లడం, నీరు నిలువ లేకుండా చూడడం, గుంతలు పూడ్చడం, వీధుల్లో చెత్త చెదారం తొలగించడం వంటి పనులు చేశారు. రోడ్డుకిరువైపులా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పాఠశాలల అవరణంలో మొక్కలు నాటారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా అధికారులు ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

**ఐడీఏబొల్లారం :** మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో వార్డు ఇంచార్జ్ దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో యువత నాయకులు వి.ప్రవీణ్‌రెడ్డి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం వృక్ష సంపదను పెంచాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, స్థానిక నాయకులు శేఖర్, అర్చన, దీప్తి, కాంచన, లక్ష్మి సురేఖ, వాసు, ప్రసాద్, శంకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**పుల్కల్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిలువ లేకుండా చూడాలన్నారు. మురుగునీటి కాలువలపై క్రిమిసంహారక మందులను పిచికారి చేయించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ పరిసరాల్లో మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నయీమ్, వసంత, జ్యోతి, సబిత, గోరేమియా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**కంది :** మండల కేంద్రంలోని మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మండల ప్రత్యేక అధికారిని లలిత కుమారి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు పాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టాక్‌ను తనిఖీ చేసారు. అనంతరం కాశీపూర్ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మైనార్టీ స్కూల్ ప్రధానోపాధ్యా యురాలు కవిత, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, డివిజ నల్ పంచాయతీ అధికారి అనిత,మండల పంచాయతీ అధికారి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి విద్యాదర్‌తదితరులు పాల్గొన్నారు.















## శిథిలావస్థలోని గదులను తొలగించాలి

- జెడ్పీసీఈవో జానకిరామ్ రెడ్డి
- రేజింతల్ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి హాజరు

నవతెలంగాణ-న్యాల్‌కల్



పాఠశాలల్లో శిథిలాస్థకు చేరిన గదులను వెంటనే తొలగించాలని జెడ్పీ సీఈఓ, జహీరాబాద్ తాలుకా స్పెషల్ ఆఫీసర్ జానకిరామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేజింతల్ శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రేజింతల్ గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. శిథిలావస్థలో చేరుకున్న గదులను వెంటనే తొలగించాలని ఎంపీడీవో, ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. పలు ఇండ్లల్లోకి వెళ్లి.. నీరు కలుషితం లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా పాఠశాల సమీపంలో ఇండ్లపై నుంచి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయని ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జీరో బిల్లు రావడం లేదని.. ఆన్లైన్లో నమోదు కాలేదని కొందరు ఆయన ముందు వాపోయారు. ఈ విషయమై సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అర్హులందరికీ లబ్ది చేకూరేలా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాలో చెత్తాచెదారం లేకుండా చూడాలని.. అపరిశుభ్రంగా కనిపిస్తే జరిమానా వేయాలని సీఈఓ పంచాయతీ సెక్రెటరీకి ఆదేశించారు. చెరువులో ఉన్న అపరిశుభ్రత నీటిని తొలగించాలని గ్రామ స్తులు సీఈఓకు విన్నవించగా.. వెంటనే నీటిని తొలగిం చేలా చర్యలు తీసుకోవాలని, కాలువల ద్వారా చెరువు నీటిని మళ్లించాలని పంచాయతీ సిబ్బందికి, ఈజీఎస్ అధికా రులకు ఆదేశించారు. గ్రామస్తులు సహకరిస్తే సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే ప్రతీ ఒక్కరూ పర్యావ రణ కాపాడాలని పిలుపునిస్తూ.. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో సురేష్, పంచాయతీ సెక్రెటరీ అరుణ జ్యోతి, ఏఈఓ సనిత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లవల్లి శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మల్ రెడ్డి, విష్ణు, ఏఎన్ఎం పుణ్యవతి, అంగన్వాడి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అలాగే స్థానికంగా ఉన్న సిద్ధివినాయక ఆలయాన్ని జానకిరామ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన్ను ఘనంగా స్వాగించారు. వేదమంత్రాల మధ్య హోమంతో పూజలు చేశారు. ఆయనతోపాటు మండల అధికారులను అర్చకులు శాలువాతో సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సీఈఓను, అధికారులను శాలువా పూలమాలతో సన్మానించారు. తదనంతరం ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఎస్సీ గురుకుల కళాశాలలో ఖాళీ సీట్లను భర్తీ చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్సీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ ఏవో పరమేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్‌సీఓ భీమయ్య పై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్స్‌లో ఇవ్వండని ఆర్‌సిఓ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి విద్యార్థుల తల్లిదండ్రులు తిరుగుతుంటే కనీసం పట్టించుకోకుండా వారిపట్ల అవమానకరంగా మాటాడడం సరికాదన్నారు. ఆర్‌సీఓ నిర్లక్ష్యం మూలంగా జిల్లాలో గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సంబంధించి సీట్లు మిగిలిపోయాయని.. ఇది పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనన్నారు. ఇంటర్మీడియట్ ప్రారంభమై నెల అవుతున్నా.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేయలేకపోవడం ఆర్‌సీఓ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వివిధ గురుకులాలో సీట్లు వచ్చిన విద్యార్థులకు వేరే గురుకులాలకు మారడానికి అవకాశాలు ఉన్న కావాలని మార్చకుండా విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వెంటనే గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై ఏఈ క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ-గుమ్మడిదల



మండల పరిధిలోని నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్, నాగిరెడ్డిగూడెం, వివిధ గ్రామాల్లో బొంతపల్లి విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ శుక్రవారం ప్రత్యక్షంగా గ్రామాల్లో పర్యటించి విద్యుత్ సమస్యల గురించి తెల్సుకున్నారు. నో వోల్టేజ్, లూప్ లైన్ మిడిల్ పోల్ వంటి సమస్యల గురించి నేరుగా రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రైతులు తెలిపిన సమస్యలను త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని లేదా విద్యుత్ సంబంధ శాఖ సిబ్బందికి తెలియజేసినా.. పరిష్కరిస్తారన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న వి.వరప్రసాద్ రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీ.సీ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంతో పాటు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వి.వరప్రసాద్ రెడ్డి ని, ప్రవీణ్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలమ్మ, స్థానిక నాయకులు రమణయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, వెంకటయ్య, దుర్గవతి, దిననాథ్, కటారం శ్రీను, లక్ష్మన్, విశ్వనాథ్, శ్రీనివాస్, స్వామి, బీరప్ప, భాను, శేఖర్, శైలేష్, ఉత్సవ నిర్వాహకులు స్థానికులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం స్థానిక ఎన్నికల సన్నద్ధంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటిస్తూ సన్నద్ధం కావాలన్నారు. నూతన వార్డుల ఏర్పాటు, వార్డుల విభజన, జనాభా, లింగ నిష్పత్తి ప్రాతిపదికన రికార్డు చేయాలన్నారు. రిజర్వేషన్ల అంశం ప్రభుత్వ పరిధిలో ఉన్నందున తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంతవరకు గ్రామా ,మండల స్థాయిలో సమాచారాన్ని క్రోడీకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీఓలు, ఎంపీడీవోలు, ఆపరేటర్లు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో మొక్కలు నాటిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ-నార్సింగి



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డీ.ఎల్.పి.ఓ, మండల ప్రత్యేక అధికారి యాదగిరి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీ.ఎల్.పీ.ఓ యాదగిరి, ఇంచార్జీ ఎంపిడిఓ చిన్నా రెడ్డి, మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవికుమార్‌లు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు వందల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో భాగంగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వందకు పైగా మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంతో మండల వ్యాప్త లక్ష్యమైన 36 వేల మొక్కలు నాటడం పూర్తవుతుందన్నారు. మొక్కలు నాటడం వరకే కాకుండా నాటిన మొక్కలకు రాబోవు తరాలకు మంచి వాతావరణాన్ని అందివ్వాలని కోరారు. ఈ కార్యకక్రమంలో ఎంపీఓ షేక్ సయీద్, ఏపీఓ రాజేశ్వర్ గౌడ్, పంచాయితీ కార్యదర్శి నాగభూషణం సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధదేవ్ భట్టాచార్యకు సంతాపం తెలిపిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-మెదక్ టౌన్

బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కమిటీ మెదక్ జిల్లా కార్యాలయంలోని కిషన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఈ మల్లేశం మాట్లాడుతూ 2011 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఏడవ ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. బెంగాల్‌ను పాలించిన ముఖ్యమంత్రి భట్టాచార్య అని తెలిపారు. బెంగాల్ రాష్ట్రాన్ని 34 సంవత్సరాల పాటు వామపక్ష ప్రభుత్వమే పరిపాలించిందన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమన్నారు. ఆయన యువజనుడిగా ఉన్నప్పటి నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. సుదీర్ఘ కాలం పాటు మంత్రిగా పని చేశారన్నారు. 2000 సంవత్సరం నుంచి 2011 వరకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. పరిశ్రమలను నెలకొల్పడంలో యువతకు ఉపాధి కల్పించడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. "బుద్ధదేవ్ బ్రాండ్" గా భట్టాచార్యకు పేరు వచ్చిందన్నారు. బెంగాల్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బసవరాజు, పార్టీ సభ్యులు అజయ్, సత్యం, సిద్దు, అజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మెదక్ ఎమ్మెల్యే

- వన మహోత్సవం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ పట్టణంలోని 12వ వార్డులో మాధవ నగర్ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనాంపల్లి రోహిత్ రావు హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరిని కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ఒక మొక్కను నాటాలని అదే విధంగా తమ నివసిస్తున్న ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించాలని, పరిసరాల్లో చెత్తను వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం సరస్వతి కాన్వెంట్ హై స్కూల్‌లో వన మహోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్పీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

స్వచ్ఛధనం పచ్చదనంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఆవర ణలో నిర్వహించిన కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. గత కొంత కాలంగా పాఠశాలకు భగీరథ నీరు రావడం లేదని విద్యార్థినీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫోన్ చేసి పాఠశాలలో తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శ్రావణ మాసం సందర్భంగా రంగంపేట పీఠాధిపతి మధనానంద సరస్వతీ స్వామి ఆశ్రమాన్ని సందర్శించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ గఫ్ఫార్, ఇంచార్జ్ ఎంపీడీవో కృష్ణవేణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్త, మాజీ జడ్పీటీసీ ముత్యంగారి మేఘాల సంతోష్, మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, తుక్కాపూర్ ఆంజనేయులు, రవీందర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బేగం, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో దొంగల హల్చల్

- మూడు దుకాణాల్లో చోరీ, 80 వేల నగదు అపహరణ



నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట దొంగలు హల్చల్ చేశారు. మూడు దుకాణాల్లో దొంగతనానికి పాల్పడి రూ. 80 వేల నగదును అపహరించారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ ట్రేడర్, శ్రీ మణికంఠ ట్రేడర్స్, మిస్టర్ చాయ్ షాపుల్లో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు వెనుక నుంచి షాపులోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. స్థానిక శ్రీలక్ష్మి ట్రేడర్స్‌లో సుమారు రూ.80 వేల నగదును ఎత్తుకెళ్లినట్టు బాధితుడు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ పేరిట వేధింపులు.. యువతి బలవన్మరణం

నవతెలంగాణ-గుమ్మడిదల



ప్రేమ పేరిట వేధింపులు భరించలేక యువ తి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గుమ్మడిదల మండల పరిధిలోని దోమడుగు గ్రామంలో జరిగింది. సీఐ సుధీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన బి ఫార్మసీ విద్యార్థి తేజస్వి(21)కి అదే గ్రామా నికి చెందిన శ్రీహరి అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమ య్యాడు. అయితే ప్రేమిస్తున్నాను.. తననే వివా హం చేసుకోవాలంటూ గత కొన్ని రోజులుగా ఆ యువతిని శ్రీహరి వేధిస్తున్నాడు. ఇదే విషయమై ఆ తేజస్విణి కుటు ంబ సభ్యులపై బెదిరింపులకు కూడా పాల్పడ్డాడన్నారు. దాంతో అతడి వేధింపులు భరించలేక గురువారం రాత్రి సమయంలో ఇంటి నాలుగో అంతస్తు నుంచి దూకి ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి చెం దింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్సై మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించినట్టు సీఐ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, బీజే పీ మండలాధ్యక్షుడు రాజిరెడ్డిలు వేర్వేరు ప్రకటనల్లో విజ్ఞప్తి చేశారు. తేజస్విని మృతి పట్ల ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# వనమహోత్సవం పండగలా జరపాలి

- జీవకోటి మనుగడకు చెట్టే మూలం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-రామాయంపేట

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని పండగల జరపాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా వన మహోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పట్టణ శివారులోని గురుకుల పాఠశాల ఆవరణలో ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మనకు స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలన్నా, విరివిగా వర్షాలు కురవాలన్న చెట్లే ఆధారమన్నారు. జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో 80 శాతం మొక్కలు నాటారని, మిగిలిన మొక్కలు నాటే కార్యక్రమం కూడా కొనసాగుతుందన్నారు.

### విద్యార్థులు విషయ పరిజ్ఞానం అలవర్చుకోవాలి

విద్యార్థులు బట్టీ పట్టకుండా విషయపరిజ్ఞానం అలవర్చుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు తెలిపారు. కాసేపు ఉపాధ్యాయుడిగా వ్యవహరించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. పరీక్షలకు ఏ విధంగా సమాయత్తం అవ్వాలో విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరు 100% మార్పులు సాధిస్తామని ధీమాతో ఉండాలన్నారు. మరోసారి పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తానన్నారు. ఉపాధ్యాయుల పనితీరును కూడా పరిశీలిస్తామని తెలిపారు.

### వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

అనంతరం పట్టణంలోని నాలుగో వార్డ్ బీసీ కాలనీలో కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా అలవర్చుకోవాలన్నారు. అలాగే చేతి శుభ్రతను కూడా పాటించాలని సూచించారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే ప్రధానంగా వీటిని పాటించాలని కోరారు. నాణ్యమైన భోజనం తీసుకుంటే రోగాలు దరిచేరవని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు పాటించాలని, ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా పైప్‌లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ భాదే చంద్రం, తహసిల్దార్ రజిని, మున్సిపల్ కౌన్సిలర్ చిలక గంగాధర్, కోఆప్షన్ సభ్యులు ఎస్.కె.అహ్మద్, హస్నొద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.





# 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ప్రభుత్వ పథకాలతో శకటాలు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

78వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ పథకాలతో శకటాలు ఏర్పాటు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్ర దినోత్సవం ఘనంగ నిర్వహించి దేశానికి సేవ చేసిన ప్రముఖులను స్మరించుకోవాలన్నారు. ఆగస్టు 15న అతిథులు జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్వాతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారని తెలిపారు. అధికారులు సమన్వయంతో బ్యారికేడింగ్, పార్కింగ్ వేదిక ఏర్పాటు చేయాలన్నారు. సభ వేదికను పలు రంగుల పూలతో అలంకరించాలన్నారు. విద్యుత్‌లో ఎలాంటి అంతరాయం కలగాకుండా చూడాలన్నారు. మెదక్ పట్టణం శుభ్రంగా ఉండేలా చూడాలని, సున్నపు లైన్ వేయాలని, ప్రోటో కాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలు ముద్రించి అతిథులకు, స్వాతంత్ర సమర యోధులను ఆహ్వానించి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. స్వయం సహాయక బృందాలను, యువతను సమీకరించాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వాతంత్ర దినోత్సవంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టరు వేంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్,మెదక్ ఆర్ డి ఓ రమాదేవి జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన అధికారులు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరం పేటలోని పలు ప్రాంతాల్లో మండల తహశీల్దార్ గ్రేసీ బాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా తదితర అధికారులు శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పేట బస్టాండ్ ప్రాంతంలో శుభ్రపరచడంతో పాటు రహదారిపై మోరాన్ని వేయించారు. ఈ పనులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పేట ఈవో వెంకటరాములు, ఐకెపి ఎపిఎం గోపాల్, సిబ్బంది వివేకానంద ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై కన్నతల్లిని చంపిన కొడుకు

నవతెలంగాణ-నిజాంపేట



మద్యానికి బానిసై కన్నతల్లిని హత్య చేసిన సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చల్మేటి దుర్గవ్వ (75) అర్ధరాత్రి కొడుకు రామచంద్రం మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలని కన్నతల్లిని అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో హత్య చేశాడు. ఘటన స్థలానికి రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, చేరుకొని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరాజగౌడ్ మాట్లాడుతూ డబ్బుల కోసం కన్న తల్లిని హత్య చేశాడని తెలిపారు. మృతురాలి కుమార్తె నాగుల విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవ పంచనామా నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే దుర్గవ్వ మరణంతో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఛాలెంజ్‌గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలి

- నెల వారి సమీక్ష సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడానికి పోలీస్ అధికారులు సిబ్బంది పనిచేయాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి డి. ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లా సిబ్బందితో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్ స్పాట్‌లను ఏర్పాటు చేసి అదునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి అక్కడ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి సూచించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ఏఏ అంశాలు క్రోడికరించాలి, తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించి కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలిపారు.సైబర్ నేరాల నియంత్రణ గురించి సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలో ఆయా గ్రామాల పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు..ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డి.ఎస్.పి వెంకట రెడ్డి, సైబర్ క్రైమ్ డి.ఎస్.పి సుభాష్ చంద్రబోస్, జిల్లా సిఐలు ఎస్. ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- పల్లెదవాఖాన వైద్యాధికారి సునీల్ కుమార్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యాధికారి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొత్తపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది యాదయ్య, వెంకటేశం, సాయిలు, వెంకటమ్మబాయి, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిఎంఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ హైవేస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ



నవతెలంగాణ-మనోహరాబాద్

వ్యాధులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడకంటే ముందే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిఎంఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ వేస్ హైవే లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ ప్రజలకు సూచించారు. జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, సి.యం.ఆర్ హాస్పిటల్‌వారి ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండల పరిధిలో గల రామాయంపల్లి పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జీ.యం.ఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ హైవే లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, మేనేజర్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిలుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహభాగ్యం, రోగాలు వచ్చిన తరువాత ఆసుపత్రుల చుట్టూ తిరిగి డబ్బులు వృధా చేసుకోడం కంటే ముందే రోగాలు రాకుండా జాగ్రత్తలు పాటిస్తే మంచిదని తెలిపారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ రమేష్ కుమార్ మాట్లాడుతూ జీ.యం.ఆర్ సంస్థ, సి.యం.ఆర్ హాస్పిటల్ వారు సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామస్తులకు హాస్పిటల్ వారు నిపుణులైన వైద్య బృందంచే పరీక్షలు నిర్వహించి అలాగే సీజనల్ వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేసి, వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలియజేశారు. సియం.అర్ హాస్పిటల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, సి.యం.అర్ హాస్పిటల్ అనుసంధానంతో ప్రతి నెల ఉచిత వైద్య శిబిరలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఎక్జిక్యూటివ్ శ్రీనివాస్, జి.యం.ఆర్ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది, నాగరాజు గౌడ్, అఫ్సర్, సాయి బాబా గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమం

- మొక్కలు నాటిన ఎంపీడీవో రాజిరెడ్డి


నవతెలంగాణ-నిజాంపేట



మండలంలోని బచ్చురాజుపల్లి, తిప్పనగుల్ల, నిజాంపేట,గ్రామాలలో శుక్రవారం ఎంపీడీవో రాజిరెడ్డి ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగంగా వర్షాకాలం నేపథ్యంలో దోమల ప్రభలే అవకాశం ఉన్నందున ఇంటి పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వన మహోత్సవాన్ని ముగించుకొని స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో చివరి రోజు మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, టీఏ రవితేజ, గ్రామ కార్యదర్శులు నర్సింలు, రాము, మారుతి, శ్యామల, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, రమావత్ రాజు,అంగన్వాడీ టీచర్లు దుర్గేశ్వరి, రేణుక, ఆశా వర్కర్లు బాలమణి, అనిత, గ్రామస్తులు మహేష్, నవీన్, ప్రశాంత్, నరేందర్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సా మిల్‌ను సందర్శించిన అటవీ అధికారులు

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని పలు సామిల్‌లను శుక్రవారం రామాయంపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్‌లు అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామిల్‌లో పనిచేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామిల్ యాజమాన్యులు ప్రభుత్వ అనుమతులకు లోబడే పనిచేయాలన్నారు. విలువైన కలపను ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని కోత ప్రక్రియ చేపట్టాలన్నారు.

# స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా వనమహోత్సవం

- పర్యావరణ రక్షణకై ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-మనోహరాబాద్

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కాళ్ళాకల్ మేజర్ పంచాయితీలో కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో గ్రామంలోని వీదులలో తిరుగుతూ స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ ఆవరణలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్దతీసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామంలో ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. మొక్కలు నాటి రక్షించాలని నాటిన మొక్కను దత్తత తీసుకుని రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో మానవునికి కావాల్సిన ఆక్సిజన్ అందుతుందని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రత అనేది వారం రోజుల పాటు మాత్రమే కాదని నిరంతం కొనసాగాలని ప్రతి ఒక్కరు శుభ్రతను పాటించాలని సూచించారు. అలాగే మనోహరాబాద్ మండల కేంద్రంలోని పంచాయతీలో కార్యదర్శి రూపాగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో జ్వర సర్వే నిర్వహించి ఎవరికైనా జ్వరం వచ్చినా వైద్య సేవలు పొందాలని సూచించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నీరు నిలుస్తే వెంటనే శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీరు నిలిచి ఉంటే దాంతో ఈగలు దోమలు ఎక్కువై అంటువ్యాదులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే గ్రామంలో ఎవరు కూడా ప్లాస్టిక్ వాడకూడదని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు కానీ, సంచులు కానీ కిరాణ దుకాణాలలో కూడా ప్రజలకు ఇవ్వకూడదని



వ్యాపారులకు తెలిపారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని మురుగు కాల్వలలో వేస్తే దాంతో నీరు నిలిచిపోయి దాంతో ఈగలు దోమలు పెరిగి అంటు వ్యాదులు ప్రభలే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చే ఏ కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యం ఉంటే అనుకున్న ఫలితం దక్కుతుందని కార్యదర్శి రూపాగౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు ఆశా, అంగన్‌వాడి వర్కర్లతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## నామ నిత్య శ్రీ మెదక్ జిల్లాకే గర్వకారణం

- అంతర్జాతీయ ఛాంపియన్షిప్-2024,
- బంగారు పతకాన్ని సాధించిన నామ నిత్యశ్రీ
- నిత్యశ్రీని అభినందించిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



మార్షల్ ఆర్ట్స్ కరాటే ఛాంపియన్షిప్ 2024 పోటీల్లో నామ నిత్యశ్రీ బంగారు పతకం సాధించడం మెదక్ జిల్లాకే గర్వకారణం అని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామ నిత్యశ్రీని ఆయన సన్మానించారు. మార్షల్ ఆర్ట్స్ కరాటే ఛాంపియన్షిప్ 2024 ను హైదరాబాదులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో 30 దేశాల నుంచి 3,000 మంది బ్లాక్ బెల్ట్ సాధించిన వారు పాల్గొనగా మెదక్ జిల్లా నుంచి నామ నిత్యశ్రీ పాల్గొని ఛాంపియన్షిప్ 2024 తో పాటు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యశ్రీ మాట్లాడుతూ నగేష్ మల్లారి, దినకర్ మాస్టర్‌ల సారథ్యంలో కోచింగ్ తీసుకొని, నిత్యం వారి సూచనలు సలహాలు పాటిస్తూ విజయం సాధించారని తెలిపారు. నిత్యశ్రీ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ కారణశీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
4
శనివారం | 10 ఆగస్టు 2024 | www.navatelangana.com

## రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు



**నవతెలంగాణ-కొండపాక**

కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు టోల్ ప్లాజా నిర్వాహకులతో కలిసి సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు. దుద్దెడ మలుపు వద్ద భారీ వాహనాలు అతివేగంగా వెళుతూ బోల్తా పడుతున్నాయి. ఈ విషయంలో వాహనదారులకు గుర్తుపట్టేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అతివేగంగా వాహనాలు నడపకూడదని ఈ సందర్భంగా సీఐ సూచించాడు. అనంతరం గ్రామస్తులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలు లాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. అలాంటివి ఎక్కడైనా కనబడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టారీత్యా చర్యలు తప్పవన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీసీ కెమెరాల ద్వారా ఎలాంటి సంఘటనైన తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ, మల్లికార్జున్, ఆరేపల్లి శ్రీను, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు కేంద్ర బడ్జెట్ లో పెంపుదల చేయాలి

- సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్



**నవతెలంగాణ-దుబ్బాక**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలంగా ఉందని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్ విమర్శించారు. ఈ బడ్జెట్ కార్మిక శ్రేయస్సును కాంక్షించేదిగా లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం గా రూ.26 వేలు, రిటైర్మెంట్ తర్వాత కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్య ,వైద్యం ,ఉపాధి రంగాలను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఈ రంగాలకు బడ్జెట్‌లో మరింతగా పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు కొంపెల్లి భాస్కర్, బత్తుల రాజు,ఆశాలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పుగుత్తులను తొలగించండి



**నవతెలంగాణ-మర్కుక్**

మండలంలోని ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసిన రైతుల ఆయిల్ పామ్ పంటలలో గుత్తులు వేసే దశలో ఉన్నాయని ఆయిల్ పామ్ తోటలలో పూల గుత్తులను (అబీలేషన్) తీయుట పై మండల వ్యవసాయ అధికారి టి నాగేందర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ అధికారి విజయ్‌లు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఎర్రవల్లి గ్రామంలో తిరుపతి రెడ్డి పంట పొలంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 14 నుంచి 18 నెలల్లో పూతకు వస్తాయని, ఒకే మొక్కపై ఆడ, మగ పుష్పాలు పూస్తాయన్నారు. తొలి దశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందాలంటే, తొలి దశలో వచ్చే పూలను తీసివేయాలని, ఈ ప్రక్రియ 30 నెలల వరకు చేసుకోవాలని సూచించారు. రైతులు నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పురుగుల యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు, తదితరులున్నారు.

## ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



**నవతెలంగాణ -నంగునూరు**

అనుమతి లేకుండా వెళుతున్న ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండి.ఆసీఫ్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున నంగునూరు మండలం ముంద్రాయి గ్రామ స్టేజ్ పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి అశోక్ తన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించామని చెప్పారు. అతని పై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

**నవతెలంగాణ-నంగునూరు**



నంగునూరు మండలం ముంద్రాయి బస్టాండ్ వద్ద రెండు అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలలో ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్ఐ ఎం.డి.ఆసీఫ్ తెలిపారు. దున్నపోతుల భాస్కర్, కోమ్మరాజుల స్వామి అను ఇద్దరూ అక్రమంగా ఇసుకను నంగునూరు నుంచి సిద్దిపేటకి తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించామని చెప్పారు.ఇసుకను అక్రమంగా తరలించేవారు ట్రాక్టర్లలో, లారీలలో తరలిస్తే పోలీసు వారికి సులువుగా దొరుకుతున్నామని ట్రాలీ ఆటోలలో ఎవరికి కనపడకుండా తరలిస్తున్నారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లో ఉచిత శిక్షణ

**నవతెలంగాణ - సిద్దిపేట**

జిల్లా బీసీ విద్యావంతులైన నిరుద్యోగ యువతకు సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు, 90 రోజుల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఎల్‌జీ హెూప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ కుషాయిగూడ హైదరాబాద్ ద్వారా 100 మంది అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సిద్దిపేట జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్.పి. కృష్ణ దయాసాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టెన్త్, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, ఒకేషనల్ కోర్సుల్లో అర్హత పొంది ఉన్న యువకులు రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, డిష్ వాషర్, ఎయిర్ కండిషనర్, ఇన్సులేషన్, గ్యాస్ ఛార్జింగ్ వాటితో పాటు వాటర్ ప్యూరీఫైర్ విభాగాల్లో శిక్షణ ఇచ్చి, శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత ఎల్‌జీ హెూప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ద్వారా ప్లేస్మెంట్ కూడా అందించబడతాయనీ, శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున మూడు నెలల పాటు స్టైఫండ్‌ను ఇస్తారన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు పైశిక్షణకు అర్హులనీ, అర్హులైన అభ్యర్థులు ఈనెల 24 లోగా టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5 లక్షల లోపు ఉండాలనీ, ఎస్ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందనీ తెలిపారు. మరింత సమాచారం కోసం 040-24071178 నెంబర్ ని సంప్రదించాలని సూచించారు.

## ప్రజలకు రక్షణ భద్రత కోసం కృషి

- తొగుట సీఐ లతీఫ్



**నవతెలంగాణ - కొండపాక**

ప్రజలకు రక్షణ భద్రత ఇతర అవసరమైన సేవలను అందించడంలో అండగా ఉంటామని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. కొండపాక మండలం దమ్మక్కపల్లిలో శుక్రవారం ప్రజలకు పలు అంశాలపై అవగాహన ప్రజలకు సేవలు అందించడంలో పోలీసులు ముందు ఉంటారని తెలిపారు. ఏ అవసరమైన పోలీసులకు సమాచారం అందివ్వాలని పేర్కొన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని తెలిపారు. సీసీ కెమెరాలతో ఎక్కడ ఏ సంఘటన జరిగిన తెలిసిపోతుందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని సూచించారు. చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కొత్త వ్యక్తులు సందర్శించిన సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన



**నవతెలంగాణ-అక్కన్నపేట**

అక్కన్నపేట మండలంలోని జనగామ గ్రామ పరిధిలో రైతు వీరముష్టి ఐలయ్య సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను ఆయిల్ ఫీల్డ్ అధికారి రవళి, ఏఈఓ శ్రీలత, డ్రిప్ భరత్ తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ మొక్కలు నాటిన 14 నుంచి 18 నెలల్లో పూతకు వస్తాయని, ఒకే మొక్కపై ఆడ, మగ పుష్పాలు పూస్తాయని అన్నారు. ఇందులో మగ పుష్పాలను తీయకుండా ఉంచినట్లైతే వేరు వ్యవస్థ అభివృద్ధి చెందదని, వేరు వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే మొదటి దశ మగ పూలగుత్తులను తీసి వేయాలని, ఇలా 30 నెలల వరకు తీసి వేస్తూ ఉండాలనీ సూచించారు. తొలి 3 ఏళ్ల లోపు అంతర పంటలు పండించి దిగుబడిని పొందవచ్చని అన్నారు. 4వ ఏడాది నుంచి 30 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. దీనివల్ల కోతుల బెడద ఉండదని, వడ గండ్ల వన వల్ల నష్టం ఉండదని, ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటుందనీ తెలియజేశారు. ఈ పంటకు పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువగా ఉంటాయని ప్రతి ఒక్క రైతు ఆయిల్ ఫామ్ తోటలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి

- చైర్ పర్సన్ వనిత



**నవతెలంగాణ-దుబ్బాక**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని వాటి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి సూచించారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ రెండో వార్డులో కౌన్సిలర్ గోనెపల్లి దేవలక్ష్మి సంజీవరెడ్డి తో కలిసి 'ఫ్రైడే డ్రై డే' అన్న కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు. నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. అనంతరం వార్డు ప్రజలకు మొక్కల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రమేష్ కుమార్, ఎ-వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు,ఆశాలు, పలువురు పాల్గొన్నారు.

# రుణమాఫీ కానివారు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి

- వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అవగాహన
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది మంత్రి పొన్నం ప్రభాకర్

**నవతెలంగాణ-కోహెడ**

ప్రభుత్వం రెండు విడతలుగా లక్షా యాభై వేల వరకు రుణమాఫీ చేసిందని, రుణమాఫీ కానివారు వ్యవసాయ అధికారులను సంప్రదించి వివరాలను తెలుసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని బస్వాపూర్ గ్రామ రైతువేదిక క్లస్టర్‌లలో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతువేదికల వద్ద అధికారులు, నాయకులతో కలిసి మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం రైతువేదికలో మంత్రి మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలు వేయకుండా వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలతో రాబడి వచ్చే పంటలవైపు మొగ్గు చూపాలన్నారు. అలాగే వ్యవసాయ సాగుతో పాటు డెయిరీ పశుపోషణ, గొర్రెలు, చెపలు, కోళ్ళ, పందుల పెంపకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు ఆయిల్ ఫామ్ తోటలను వేయాలని, వాణిజ్యపంట డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు పెంచాలని, మల్బరి చెట్లు పెంచి పట్టుపురుగుల పెంపకం చేపట్టాలని, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని పొందాలని సూచించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే లక్ష యాభై వేల రూపాయల రుణమాఫీ చేసి దేశంలోనె మొట్టమొదటి రాష్ట్రంగా నిలిచిందన్నారు. అలాగే 200 యూనిట్‌లలోపు ఫ్రీ కరెంట్ రానట్లయితే ప్రజాపాలన సేవాకేంద్రాల వద్ద ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. గ్యాస్ సబ్సిడీ రాకుంటే వెంటనే ప్రజాపాలన కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా పెరటికోళ్ళ పెంపకానికి 50 లక్షల రుణం తీసుకున్నట్లయితే 50 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. అలాగే రైతులు ఒప్పుకున్నట్లయితే పొలాలకు రోడ్డు వేస్తామన్నారు. ఇప్పటికే రూ.12 కోట్ల 50 లక్షల వడ్డీలేని రుణాలను అందించామన్నారు. రూ.8 కోట్ల 40 లక్షలతో సోలార్ విద్యుత్ యూనిట్ ఉంటుందని ఇట్టి దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్, జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాకర్, తహశీల్దార్ సురేఖ, ఏవో భోగేశ్వర్, ఎంపీడీవో కృష్ణయ్య, వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నిమ్రాతరుణమ్, పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, కర్ణకంటి మంజూలరెడ్డి, నాయకులు బస్వరాజు శంకర్, దొమ్మాట జగన్‌రెడ్డి, వేల్పుల వెంకటస్వామి, బందెల బాలకిషన్, బొబ్బల మహేందర్‌రెడ్డి, భీంరెడ్డి తిరుపతిరెడ్డి, అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘం అధ్యక్షురాలు కొమ్మిడి శారద, రైతులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇదేం మోడల్ ..?

- ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా..
- ఇంకా సీఎం కేసీఆరే నట.!

**నవ తెలంగాణ-దుబ్బాక**

కొందరి బాధ్యతారాహిత్యం, ప్రభుత్వం పట్ల విధేయత లేని తనం, వెరసి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తున్నారు.తెలంగాణలో అధికార మార్పిడి జరిగి దాదాపుగా 9 నెలలు కావస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏ.రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నా, సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో మోడల్ స్కూల్ ప్రధాన ప్రవేశదారి గోడ పై ఇంకా ముఖ్యమంత్రి కేసీఆర్ పేరే ఉండడం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పనితీరుకు నిదర్శనం. మాజీగవర్నర్ తమిళిసై, మాజీ మంత్రుల పేర్లనే ఇంతకాలంగా ప్రదర్శిస్తున్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది నిద్రాణ స్థితిలో ఉన్నారా..? అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ముక్కున వేలేసుకుంటున్నారు. అవగాహన లేకపోవడమా లేకా నిర్లక్ష్యమా అన్న చందంగా ఉంది మోడల్ స్కూల్ సిబ్బంది వ్యవహారం.




**ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలి**

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతుంది. లచ్చపేట మోడల్ స్కూల్ గోడలపై వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్, మంత్రుల పేర్లను రాయించాలి. ఇంతటి నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు పదాల వినయ్ కుమార్

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**నవతెలంగాణ-అక్కన్నపేట**

అక్కన్నపేట మండలం పోతారం(జె)గ్రామంలో యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాంద్రాల దాము ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దాము మాట్లాడుతూ గత పది ఏళ్ల నుంచి యువజన కాంగ్రెస్ తరపున ఎక్కడ సమస్యలున్న ముందుండి పోరాడనని అన్నారు. పొన్నమన్న గెలుపు కోసం అహర్నిశలు పాటుపడ్డామని తెలిపారు. యువజన కాంగ్రెస్ పడ్డ కష్టానికి ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఆనందం వ్యక్తం చేశారు. రాబోవు యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో కూడా మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో భూ ఆక్రమణలను అరికట్టండి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల జీ.భాస్కర్



**నవతెలంగాణ-దుబ్బాక**

దుబ్బాక పట్టణ కేంద్రంలో కొందరు భూ కబ్జా రాయుల్లు ప్రభుత్వ భూముల్ని ఆక్రమిస్తున్నారని, ఈ భూ అక్రమణాలను ప్రభుత్వ అధికారులు అరికట్టాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ ఆక్రమణలను అరికట్టాలని కోరుతూ మున్సిపల్ బిల్ కలెక్టర్ మేఘమాలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రం నుంచి దుంపలపల్లికి వెళ్లే రోడ్డులో గల షాదీఖానాకు ఎదురుగా ఉన్న 'కల్వర్టు కాల్వ 'ను కొంతమంది అక్రమంగా కబ్జా చేసి ఫెన్సింగు కట్టారని ఆరోపించారు. ఈ కల్వర్టు నుంచి కాల్వ ద్వారా పట్టణంలోని రామసముద్రం చెరువులోకి వర్షం నీరు వెళుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పలుచోట్ల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు నిఘా పెంచి ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఐ(ఎం) నాయకులు కొంపల్లి భాస్కర్, లక్ష్మీనర్సయ్య,రాజు ఉన్నారు.

## బకాయి పడిన కరువు భత్యం మంజూరు చేయాలి

- పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి



**నవతెలంగాణ-నంగునూరు**

బకాయి పడిన కరువు భత్యం మంజూరు చేసి, 50 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే వేతన సవరణ చేయాలని పీఆర్టీయూ టిఎస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ముంద్రాయి, వెంకటాపూర్, తిమ్మాయపల్లి, నర్మెట, అంక్షాపూర్ , ఖానాపూర్, ఖాత, గట్లమల్యాల, అక్కెనపల్లి, నంగునూరు గ్రామాల్లోని వివిధ పాఠశాలలలో సభ్యత్వ నమోదు కర్యక్రమం నిర్వహించారు. ఏకీకృత సేవా నిబంధనలు తీసుకొచ్చి జూనియర్ లెక్చరర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్, డైట్ కాలేజీ లెక్చరర్, ఎంఈవో, జిల్లా ఉప విద్యాధికారి పోస్టులను ఉపాధ్యాయుల పదోన్నతులతో నింపాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మానిఫెస్టోలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి పాత ఫించను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 11, 12 సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్ఎం. పదోన్నతి కల్పించాలని కోరారు. పదివేల పీఎస్ హెచ్ఎం పోస్టులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. పెండింగ్ లో నున్న ఉపాధ్యాయుల వివిధ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే బకాయి పడిన నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించేందుకు అనుమతులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కొత్తపల్లి రవి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర పార్థసారథి,పంతం నరేష్, పీఆర్టీయూ నాయకులు భూపతి రెడ్డి, రామస్వామి, రామరాజు, కన్యాలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల తర్వాత బస్టాండ్ పనులు ప్రారంభం



**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ పట్టణంలో బస్టాండ్ పనులు స్లాబ్ వేసినప్పటికీ మిగతా పనులు పూర్తి చెయ్యకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు గురయ్యారు. దీనిపై నవతెలంగాణ దినపత్రిక అనేక కథనాలను అందించింది. బస్టాండ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలాలకు అతీతంగా ప్రయాణికులు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కథనాలు అందించింది. ఆరు నెలలుగా బస్టాండ్ నిర్మాణ పనులు నిధులు లేక నిలిచిపోయింది. చేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్కు డబ్బులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఇప్పటికీ సైతం కాంట్రాక్టర్కు నిధులు విడుదల కాలేదు అయినా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పనులు ప్రారంభించినట్లు తెలుస్తుంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలో మోడల్ బస్టాండ్లో నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.6.30 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి చివరకు బిల్లును రాకపోవడంతో ఇంతకాలం పనులు నిలిపివేశారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్య లపై వార్తా కథనాలు రావడంతో కాంట్రాక్టర్ విధిలేని పరిస్థితిలో పనులు ప్రారంభిం చినట్లు తెలుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా నిధులు విడుదల చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. గత నెల 22 నుంచి కురుస్తున్న వర్షాలకు గజ్వేల్ బస్టాండ్ ముందు ఉన్న స్థలంలో ప్రయాణికులు వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడ్డారు. ఎట్టికేలి గజ్వేల్ బస్టాండ్ ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు అని చెప్పాలి.

## ఎస్జీటీల సమస్యలు పరిష్కరించాలి



**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ నందు గజ్వేల్ డివిజన్ స్థాయిలో ఎస్జీటీ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గజ్వేల్, వర్గల్, జగదేవ్పూర్, ములుగు, మార్కుక్,రాయపోలు మండలాల ఎస్జీటీ ఉపాధ్యాయులు వివిధ సంఘాల సభ్యత్వాలకు రాజీనామా చేస్తూ ఎస్జీటీ యూనియన్‌లో చేరినట్లు ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తెలిపారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో ఎస్జీటీ సమస్యలు అయిన పీఎస్‌హెచ్ఎం పోస్టులు 10వేలు వెంటనే మంజూరు చేయాలని, ఎమ్మెల్సీ ఓటు హక్కు ప్రతి ఎస్జీటీ ఉపాధ్యాయునికి రావాలని, 317 జీవోలో వేరే జిల్లాకు కేటాయించబడినటువంటి ఉపాధ్యాయులను తిరిగి స్థానికత ఆధారంగా స్థానిక జిల్లాకు కేటాయించాలన్నారు. ఇటీవల బదిలీ కాబడినటువంటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేస్తూ విద్యావాలంటీర్ల నియమించాలని సీపీఎస్ రద్దు, ప్రతి పాఠశాలకు కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చూడాలని ఈ కార్యక్రమంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, వర్గల్ మండల పీఆర్‌టీయూ బాధ్యులు శ్రీధర్ రెడ్డి , శ్రీనివాస్ ,సుధాకర్, రాయపోల్ మండలం యుటఎఫ్ ప్రధాన కార్యదర్శి నరసింహ తమ మాతృ సంఘాలకు రాజీనామా చేసి ఎస్జీటీ సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.గజ్వేల్ డివిజన్ ఎస్జీటీ ఉపాధ్యాయులు మొత్తం దాదాపు 100మందికి పైగా పాల్గొన్నారు. ఇంకా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి బోడవేణు, ప్రభాకర్ సంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్, నరేష్ దౌల్తాబాద్, చెన్న సురేష్ , రవికుమార్ పాల్గొన్నారు.

## కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం



**నవతెలంగాణ-మర్కుక్**

కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం నుంచి మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ధర్నాలు, రాజీవ్ రహదారుల దృశ్యంధం చేస్తామని హెచ్చరికలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సర్కార్ తలొగ్గి మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్లోకి నీళ్లు విడుదల చేశారని బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో గల కొండ పోచమ్మ ప్రాజెక్ట్ లోకి నీరు వదిలిన సందర్భంగా వారు పూజలు పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై అభండాలు మాట్లాడుతూ గత ప్రభుత్వంపై అబండాలు వేసిందన్నారు. కాళేశ్వరం నుంచి నీటిని మానేరు, శుక్రవారం మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాలు వస్తున్నాయన్నారు దీనికి నిదర్శనమే కాళేశ్వరం ప్రాజెక్ట్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అబద్ధమైతే గోదావరి నీళ్ల 512 ఫీట్ల ఎత్తుతో మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ లోకి వచ్చేవా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .కాళేశ్వరం ఫెయిల్ అయితే నీళ్లు ఎట్లా వచ్చినాయో రేవంత్ రెడ్డి జవాబు చెప్పాలని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఉత్తర తెలంగాణలో 2 టీఎంసీల ప్రాజెక్టుల నిర్మాణాలు గతంలోని కేసీఆర్ ప్రభుత్వం చేపట్టి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సకాలంలో రైతన్నలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ దన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గత 75 ఏళ్ల స్వతంత్ర కాలంలో ప్రభుత్వాలు మారిన రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఆకలి చావులు రైతు ఆత్మహత్యలు ఎన్నో జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ దేవగనిక నాగరాజు ,కౌన్సిలర్లు మర్కంటి కనకయ్య, గంగిశెట్టి రవీందర్, అహ్మద్, స్వామి, చారి, పుల్ల బీరయ్య, శ్రీనివాస్ చారి, ఏల వెంకటేశం, నరేష్, రైతులు, తదితరులున్నారు.

## వాయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**నవతెలంగాణ-గజ్వేల్**

కేరళ వాయనాడ్‌లో జరిగిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, వరదల్లో కొట్టుకుపోయిన కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమలో కేరళ వాయనాడ్ బాధితులకోసం శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో కురిసిన వర్షాలకు అర్ధరాత్రి సమయంలో కొండ చర్యలు విరిగిపడి మట్టి బండ రాళ్లు కొట్టుకొని వచ్చి రెండు గ్రామాలను పూర్తిగా ధ్వంసం చేసిందని, దీంతో ఇండ్లు పంట పొలాలతోపాటు నిద్రలోనే సుమారు 350 మందికి పైగా మరణించారని, 500 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారన్నారు. మానవ సమాజం మానవతా దృక్పథంతో స్పందించాల్సిన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం కుటుంబాలను ఆదుకునేందుకు అనేక రూపాల్లో చర్యలు తీసుకుంటుందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించి పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రానే పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, రంగారెడ్డి, మల్లయ్య, రాజగోపాల్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు బదిలీలు సహజం

**నవతెలంగాణ -నంగునూరు**

ఉద్యోగులకు బదిలీలు సహజమని మండల విద్యాధికారి టి. దేశిరెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూరు ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేసిన అంకితభావంతో పనిచేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు. ప్రయివేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధనా జరుగుతుంది అని అన్నారు. బదిలై పోయిన ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, మల్లేశం 150 మంది విద్యార్థులకు స్టీల్ పళ్లాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, ఉపాధ్యాయులు కల్లాటి శ్రీనివాస్, శనిగరం కనకయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ యమున, సీఆర్పీలు పెంటయ్య, మోహన్ బాబు విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక



**నవతెలంగాణ-మద్దూరు**

మద్దూరు మండల కల్లుగీత కార్మిక సంఘాన్ని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా బొమ్మగోని శివయ్య, బండిబాలయ్య, కూరేళ్ల బాలయ్య , మండల అధ్యక్షులు పోతుగంటి లింగం, మండల ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి జనార్దన్, గుండెగోని మల్లేశం, వగలబోయిన రాజు, మండల ప్రధాన కార్యదర్శిగా బండి నర్సింహులు గౌడ్, మండల కోశాధికారిగా కూరేళ్ల శంకరయ్యగౌడ్, సహాయ కార్యదర్శులు బురుగురాజు, నాగిళ్ళ పరమేశ్వర్ సిద్ధులు, కార్యవర్గ సభ్యులు, బొంగోని భిక్షపతి, బోడిగం బాబు, గుండెగోని మల్లయ్య, కూరేళ్ల వెంకటయ్య, నాగిళ్ళ శ్రీనివాస్, కూరేళ్ల రవి,గుండెగోని రామస్వామి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా బండి గణేష్,కో కన్వీనర్ గా గుండెగోని రాకేష్,తాళ్లపల్లి వీరేందర్, నాగిళ్ళ పరమేష్ లను ఏకగ్రీవంగా మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమణ, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమురయ్య బండకింది అరుణ్, జిల్లా కమిటీ సభ్యులకు మండల కల్లు గీత కార్మికులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- కవి సింగీతం నరసింహారావు



నవ తెలంగాణ - సిద్దిపేట

చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవరుచుకోవాలని కృష్ణం వందే జగద్గురు సాహితీ సంస్థ అధ్యక్షులు సింగీతం నరసింహారావు అన్నారు. జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా చిన్నారులలో చిన్నప్పటి నుంచి పద సంపద అలవడుతుందని అన్నారు. ఎలాంటి సాంకేతిక యుగాలు వచ్చిన పుస్తక పఠనం మాత్రం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాసాప అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ల రాజేశం, బస్వరాజ్ కుమార్, ఉండ్రాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ బృందం సభ్యుల పర్యటన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం, గాగీల్లపూర్ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు నేరెళ్ల రమేశ్, కుక్కల సాహెబ్ శుక్రవారం పర్యటించారు. అయా గ్రామాల్లో వీధుల గుండా పర్యటించి ఇంటింటా మిషన్ భగీరథ నీరు సరఫరా తీరు, నాణ్యతను పరిశీలించారు. భగీరథ నీరును నిపుణుడు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనావత్ రేణుకా తెలిపారు. అనంతరం అయా గ్రామాల్లోని అంగన్వాడీలను బృందం సభ్యులు సందర్శించి పరిసరాల పరిశుభ్రత,పారిశుధ్యం, త్రాగునీరు వినియోగంపై అవగాహన కల్పించినట్టు ఏఈ తెలిపారు. అయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు మంద రమేశ్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను నియమించాలి



నవతెలంగాణ-మర్కుక్

ప్రాథమిక విద్య బలోపేతం కావాలంటే ప్రతి ప్రాథమిక పాఠశాలకు పీఎస్‌ఎంచ్‌ఎం పోస్టులను తప్పనిసరి భర్తీ చేయాలని పీఆర్టీయూ మర్కుక్ మండల శాఖ అధ్యక్షులు నారెడ్డి రామ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మర్కుక్, పాములపర్తి, దామరకుంట, ఎర్రవల్లి, చేబర్తి, అంగడికిష్టాపూర్, గణేష్ పల్లి, నర్సన్నపేట, కర్కపట్ల, బావావ నందపూర్, కాశిరెడ్డి పల్లి, పాతూరు తదితర పాఠశాలలలో బుధవారం, గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఎజ్జీటీలకు ప్రతి ఒక్కరికి బీఎడ్, డీఎడ్ లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి పీఎస్‌ఎంచ్‌ఎం ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. బదిలీ అయి రిలీవ్ కానీ ఎజ్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేస్తూ వారి స్థానంలో విద్యావాలంటరీలను నియమించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ఆధారంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ రావు, నీరడి లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింలు, షాబోద్దీన్, యాదిరెడ్డి,సరితా దేవి నాయకులు రమణారావు, గణేష్, కేశవరెడ్డి తదితరులున్నారు.

## ప్రాజెక్టుపై ఉన్న కెమెరాలు మాయం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ పరిధిలోని గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై ఎన్జీటీ ఆర్డర్ ప్రకారం జీఆర్‌ఎంబీ వారు బిగించినటువంటి సీసీ కెమెరాలు నాలుగు మాయమై పోయినట్టు తెలుస్తోంది. గౌరవెల్లి నుంచి బంజారాహిల్స్ సైడ్ ఉన్నటువంటి కుడి తూము వద్ద ఉన్న నాలుగు కెమెరాలు కనిపించకుండా పోయాయని పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. మరి ఈ కెమెరాలు ఎవరు దొంగిలించారు అనేది తెలియలేదు. మరి దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి కెమెరాలు ఎటుపోయాయో తేల్చాలని పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

## పేద కుటుంబాలకు ఎంతో ఆసరా సీఎం సహాయ నిధి


- బీజేపీ మండల అధ్యక్షులు సర్వుగారి భూపాల్ రెడ్డి



నవతెలంగాణ- రాయపోల్

బడుగు బలహీన పేద ప్రజలు అనారోగ్యానికి గురి అయితే సీఎం సహాయనిధి పథకం ద్వారా లబ్ధి పొందుతూ మెరుగైన వైద్యం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని దౌల్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షులు సర్వుగారి భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లి, ఇందుప్రియల్, తిరుమలాపూర్ గ్రామాలలో లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు తిరుమలపూర్ గ్రామానికి చెందిన పడాల రుక్కమ్మ రూ.42 వేలు, అప్పాయి పల్లి గ్రామానికి చెందిన మల్లయ్య రూ.33,500 వేలు, ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన శాంతమ్మ రూ.18 వేలు, మల్లవ్వ రూ .10,500 వేల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాల ప్రజలు అనారోగ్యం గురవుతే వైద్యం చేయించుకోవాలనుకుంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అలాంటిది సీఎం సహాయ నిధి ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా చికిత్స తీసుకోవచ్చు అన్నారు. పేదల పక్షాన పోరాడే ప్రజా నాయకులు ఎంపీ రఘునందన్ రావు, ఆయన సహకారంతోనే సీఎం సహాయం నిధి చెక్కులు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరు అనారోగ్యానికి గురైన సీఎం సహాయం నిధి పథకం ద్వారా లబ్ధి పొందాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కురుమ గణేష్, దుబ్బాక నియోజకవర్గ మన్ కీ బాత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్చార్జులు చిక్కుడు స్వామి, భాను, గడ్డమీద స్వామి, గ్రామ అధ్యక్షులు రాజుల గణేష్, పాల్గొన్నారు.


## డీడీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై బెల్టులు, ఐడీ కార్డులు పంపిణీ



నవతెలంగాణ-మద్దూరు


దూల్మిట్ట జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దూల్మిట్ట డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు టై బెల్ట్, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, డీడీఎఫ్ సభ్యులు పబ్బోజు సత్యం, కొంగర రాజు, భావడ్లపల్లి కృష్ణ, బావం ఢ్లపల్లి రాజు, దుబ్బుడు మహేందర్ రెడ్డి, డీడీఎఫ్ ప్రతినిదులు, దూల్మిట్ట పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ- ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువతకు ఎల్లవేళలా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తమ్మల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కొండు నరసింహులు , మాజీ వార్డ్ మెంబర్ రాజు, బుడిగే సంజీవులు,రాజు,స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల వంటిమా మిడిలో యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. 64వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘనంగా జెండా అవిష్కరణ అలాగే యూత్ కాంగ్రెస్ నినాదాలతో జెండా ఆవిష్కరించిన టీపీసీసీ అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్ రావు యువకులు రానున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తమ సత్తా చాటి భారీ ఎత్తున సభ్యత్వాలు చేపించి అన్ని మండలాల అధ్యక్ష అభ్యర్థులు, నియోజక వర్గ అభ్యర్ధి, జిల్లా అభ్యర్థి రాష్ట్ర అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. యువతే కాంగ్రెస్ పార్టీకి బలం యువ సత్తా ఈ యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు టీగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయ్ కుమార్ మూలుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మళ్ళా రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుల రవీందర్, సీనియర్ నాయకుల బూపల్ రెడ్డీ, జిల్లా యువజన కాంగ్రెస్ అభ్యర్థి చెత్తిపల్లి అనిల్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ మూలుగు, జగదేవపూర్, గజ్వేల్, కొండపాక, బూరం మహేందర్, నాయకులూ పాల్గొన్నారు.

# సాగు కాల్వలీట్లా.. నీరు పారేదెట్లా..?

- మట్టి, గడ్డితో నిండిపోతున్న డీ7 కాల్వ
- చివరి ఆయకట్టుకు నీరందడం ప్రశ్నార్థకమే



నవతెలంగాణ-బెజ్జంకి

ఆయకట్టు భూములకు సాగు నీరందించే కాల్వలు మట్టి, గడ్డితో నిండిపోయాయి. నీరు ముందుకెళ్లకుండా మట్టి, గడ్డి పెరిగాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించడం ప్రశ్నార్థకంగా మారింది. బెజ్జంకి మండల రైతుల వ్యవసాయ సాగు పంటలకు అవసరమయ్యే నీటిని అందించేందుకు ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ జలాశయ నీటి వనరు మండల పరిధిలోని గుండారం, బెజ్జంకి, కల్లెపల్లి, లక్ష్మీపూర్ గ్రామ శివారులో డీ7 కాల్వ నిర్మాణం చేపట్టి చెరువులకు నీరు సరఫరా చేసి సాగుకు గత ప్రభుత్వం నీరదించింది. డీ7 ప్రధాన కాల్వ మరమ్మతులపై ప్రభుత్వం, సంబంధిత అధికారుల అలసత్వం వల్ల సాగు కాల్వలో పూడిక పేరుకుపోవడంతో పాటు, చెత్తచెదారంతో కాల్వ నిండిపోయి రూపురేఖలు మారిపోతున్నాయి. దీంతో నీరు చివరి ఆయకట్టుకు చేరుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతుల అవసరాల కోసం అన్నపూర్ణ జలాశయం నుంచి నీటిని డీ7 కాల్వ ద్వార ఆయకట్టుకు విడుదల చేస్తారు. ఇక్కడి నుంచి ప్రధాన కాల్వ ద్వారా చెరువులను నింపేందుకు విడుదల చేస్తుంటారు. వీటిని రైతులు తమ వ్యవసాయ అవసరాలకు వాడుకునే వెసులుబాటు ఉంటుంది.

**-చివరికి ఆయకట్టుకు చేరేనా..?**

ఈ కాల్వల ద్వారా వచ్చే నీటితోనే రైతులు తమ వ్యవసాయ అవసరాలను తీర్చుకుంటారు. అన్నపూర్ణ జలాశయం నుంచి కాల్వల్లో నీరు ప్రవహించి చివరి ఆయకట్టును చేరుకోవాలి. ప్రస్తుతం కాల్వ పరిస్థితి వల్ల నీరు చివరికి చేరుకోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. మండలంలో రైతులు ప్రధానంగా వరి సాగు చేస్తారు. కాల్వల పరిస్థితి ఇలా ఉంటే అవసరాలకు నీరు పంటకు ఎలా అందుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాభావ పరిస్థితుల వల్ల సకాలంలో వరి నాట్లు పడలేదని, ఇప్పుడు కాల్వల ద్వారా నీరు సకాలంలో అందకపోతే పంటకు నీటి తడుల్లో ఇబ్బందులు తప్పేలా లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు కాల్వలను బాగు చేసి చివరి ఆయకట్టుకు నీటిని అందించాలని కోరుతున్నారు.

**గడ్డిని కాల్చి సాగునీరు సరఫరా**

కాల్వలో నిండిపోయిన గడ్డిని కాల్చి సాగునీరు సరఫరా చేస్తాం. ప్రభుత్వాదేశానుసారం డీ7 కాల్వ చివరి ఆయకట్టు గ్రామాలకు గత సీజన్లో నీరందించాం. ఈ సీజన్లో ప్రభుత్వాదేశానుసారం నీరందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయకట్టు పరిధిలోని అన్ని గ్రామాల చెరువులు నింపేందుకు చర్యలు తీసుకుంటాం

-నాగేశ్వర్ రావు ఏఈ

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్య భద్రత

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్











నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం భద్రతగా ఉంటుందని జిల్లా అదుపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక జ్యోతిబాపూలే పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమం భాగంగా గరీమ అగర్వాల్ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల విద్యార్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎమ్మార్వో హరికిరణ్, ఎంపీఓ శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి పంచాయతీ కార్యదర్శి సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

స్వచ్ఛదనం పచ్చదనంలో వార్డులో గుంతలు పుడుస్తున్నామని 3 వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లో 3వార్డులో తాత్కాలికంగా ఉన్న గుంతలను పూడ్చారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు మునిసిపాలిటీలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయన్నారు. తాత్కాలికంగా డస్ట్‌తో రోడ్డులాన్ని మున్సిపాలిటీ బాధ్యులు వేయించమన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు అధ్యక్షులు శ్రీరామ్ మల్లేశం, నాయకులు ఎల్ల వెంకటేశం, మర్రి స్వామి, కాటు కళ్యాణ్,తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

మొక్కల్ని విరివిగా నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీఐ పి.శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశాల మేరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని సీఐ కార్యాలయం వద్ద ఎస్ఐ గంగరాజు, పోలీసు సిబ్బందితో కలిసి సీఐ శ్రీనివాస్ మొక్కల్ని నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరి సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, మార్కా ఆనీల్ గౌడ్, పార్టీ నాయకులు బొంగుని శ్రీనివాస్, పోలు సంపత్ , గట్టు రాములు, గాజుల భగవాన్, గంపల శ్రీనివాస్, దానవీని రమేష్, బత్తుల మల్లికార్జున్ ,పోలు రాజయ్య , చింటూ కొడముంజ స్వామి, పోగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు వాతావరణ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని రాయపోల్ మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం', వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో డబ్బులు ఖర్చు పెడుతూ మొక్కలు నాటుతున్నారని, ప్రజలందరూ సహకరించి గ్రామాలలో ఖాళీ ప్రదేశాలు, వ్యవసాయ పొలాల వద్ద విరివిగా మొక్కలు నాటి పెంచాలన్నారు. మొక్కల వలన జీవరాశికి ప్రాణాధారమైన ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురవడానికి చెట్లు అధికంగా ఉండాలన్నారు. అభివృద్ధి ఆధునికరంలో భాగంగా చెట్లను నరికి వేయడం అధికమవుతుందని, వాతావరణంలో సమతుల్యతతో దెబ్బతింటుందన్నారు. కాబట్టి అధికంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించి రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ రాములు, తాజా మాజీ సర్పంచ్ కరుణాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణాన్ని పచ్చదనంతో స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం ఐదవ రోజు కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రైడే, వనమహోత్సవం నిర్వహించారు. ఏడవ వార్డులోని డిపో వెనుక కాలనీలో, 1వ వార్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతిరోజు రెండుసార్లు మొక్కలకు నీళ్ల పోయాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల ఉష్ణోగ్రత, కాలుష్యం తగ్గుతుందన్నారు. కాలుష్యం తగ్గడం వల్ల పర్యావరణం మెరుగుపడుతుందని తెలిపారు. సీజనల్ వ్యాధులు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ రాకుండా ఇంట్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు రోడ్లకు ఇరువైపు లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించుకోవాలని, హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుకోవాలని దానికి ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ , వైస్ చైర్పర్సన్ అనిత రెడ్డి, కౌన్సిలర్లు నళిని దేవి,బొజు రమా దేవి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జి అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆదేశాల మేరకు చింతమడకలోని మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ముఖ్యంగా భోజనంకి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలి అని సూచించారు. వేడి ఆహారం తీసుకోవాలని బయట లభించే ఆహార పదార్థాలు కలుషితమైన నీరు తీసుకోకూడదని అన్నారు. పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని చెట్లను నాటడం వలన పర్యావరాన్ని కాపాడవచ్చని, తద్వారా స్వచ్ఛమైన గాలి వర్షాలు పడతాయని పాఠశాలలో ఉన్న సమయంలో కానీ ఇంటి వద్ద గాని ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్న వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున, మీ ఇంటి పరిసరాలు ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ముఖ్యంగా ఇంటి పరిసరాల ఎక్కడైనా పగిలిపోయిన గాజు పింకల్లో, కొబ్బరి బోండా, వాడిపడేసిన టైర్లు, వాడకుండా పడేసిన కూలర్లు, కుండ ముక్కలు, తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, చక్రధర్, కొండయ్య, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని జెడ్పీ సీఈఓ రమేష్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్ద గుండవెల్లి, బల్వంతపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. పరిశుభ్రతలతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను కేవలం గ్రామపంచాయతీ చెత్తబండికే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంపీ ఓ నరేందర్ రెడ్డి, ఏఈ రోహిత్ వాస్తవ, గ్రామ కార్యదర్శులు తదితరులున్నారు..

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం-పచ్చదనం అలాగే డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులో నిర్వహించిన కార్యక్రమంతో స్వచ్ఛదనం-పచ్చదనం అట్టహాసంగా ముగిసిందని చెప్పాలి. మున్సిపల్ పరిధిలోని15వ, 9వ, 6వ, 5వ, 10వ, 7వ, 20వ వార్డుల కౌన్సిల్ సభ్యులతో కార్యక్రమాలు నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, కమిషనర్ నరసయ్య. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని నిల్వ ఉంచకూడదని వాటివల్ల దోమలు వచ్చే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. 5వ వార్డ్‌లోని స్థానిక కౌన్సిలర్ శీర్ల శ్యామల, మల్లేష్ యాదవ్ కలిసి పారిశుద్ధ విభాగంలో ఎడ్యుకేషన్ హబ్ నందు పిచ్చి మొక్కలను తొలగించుట, చుట్టూ పరిసరాలలో ఉన్న చెత్తను శుభ్రం చేసుకోవాలి. వారు చెప్పారు. వార్డులో గల ఐఎంఏ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. చెట్లను పెట్టడమే కాకుండా చెట్లను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాటిని సంరక్షించుకోవాలని, అలాగే ప్రతి ఒక్కరూ వారు పుట్టినరోజు, కానీ వివిధ శుభ కార్యమునప్పుడు చెట్లను నాటి చెట్లను పెంచాలని, వాటి వల్ల మనకు ఎన్నో లాభాలు ఉన్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జక్కి ఉద్దీన్, కౌన్సిలర్స్ ఉప్పల మెట్టయ్య వంటేరు గోపాల్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షరీఫ ఉమర్, ఇస్మాయిల్, మున్సిపల్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, వార్డ్ అధ్యక్షులు మామిడి శంకర్, ఆశ వర్కర్లు అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఐదు రోజులుగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ చెప్పారు. చివరి రోజు మార్కెట్లో పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాన్ని విజయవంతం చేశామని పేర్కొన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న మార్కెట్లోని పలు కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంతో పరిశుభ్రత దోమల నివారణ మొక్కల పెంపకం తదితరాపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, జేఎంఎస్ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

33వ వార్డులో కౌన్సిలర్ తస్లీమ్ బేగం -అబ్దుల్ మొయిజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఇంటింటికి పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి యూసుఫ్, ఆర్పీ సునీత, అంగన్వాడీ టీచర్లు నర్మదా దేవి, ఆశ వర్కర్, బీఆర్‌ఎస్ బీసీ సెల్ కోఆర్డినేటర్ ముదిగొండ శ్రీనివాస్, లగిశెట్టి నరహరి, బల్ల శ్రీనివాస్, తుమ్మ ప్రకాష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

మొక్కలను ప్రతి ఒక్కరు సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల ప్రజలకు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 23వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్‌తో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పభోజి దయాకర్, అత్తిలి కృష్ణ, వడ్డేపల్లి సూర్యనారాయణ, బాలరాజు, పబ్బు, జి శ్రావణ, వార్డ్ ఆఫీసర రవి, ఆర్పీ లావణ్య, అంగనవాడీ టీచర వనిత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

వార్డు ప్రజలందరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని 43 వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్ సూచించారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా చెట్ల పంపిణీ చేశారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ సురేష్, ఆర్ పి శ్రీమతి, అంగన్వాడీ టీచర్, ఏఎన్‌ఎం రేణుక, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

మొక్కలు పర్యావరణాన్ని సంరక్షణకు ఉపయోగపడుతాయని, నాటిన ప్రతి మొక్కను కాపాడాలని మండల స్థాయి అధికారులు తెలియజేశారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం ఐదవ రోజు కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ వద్ద మెగా ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం పచ్చదనం లో పాల్గొన్న మండల స్థాయి అధికారులకు, మాజీ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.లక్ష్మప్ప, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీవో ప్రభాకర్ రావు, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వి.చంద్రకళ, ఎఫ్ఏ దేవులపల్లి నర్సింగరావు, కార్యాలయం సిబ్బంది, డ్వాక్రా గ్రూపు మహిళలు, సీఏలు, వీఓఏలు, గ్రామస్థాయి అధికారులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ఐదో వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసినట్లు వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వార్డులో తిరుగుతూ పూల మొక్కల పంపిణీ చేశారనీ, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రేరణలతో కలిసి మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అన్వేష్ రెడ్డి, యాదగిరి, వార్డ్ ఆఫీసర్ సుదర్శన్, ఆర్పీ రాధ, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, చంద్రకళ, ఏఎన్‌ఎం శహీన్ సుల్తానా, ఆషా వర్కర్ లక్ష్మి, జవాన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

















## ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచితంగా దంత పరీక్షలు చేశారు. దాదాపు 150 మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు చేశామని నిర్వాహకులు వెల్లడించారు. అవసరమైన విద్యార్థులకు వెంటనే మందులు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన ఎండి ఖలీల్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 15,500 చెక్కును శుక్రవారం దామకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం ఆంజనేయులు, శంకర్, బి.రాజు, తదితరులున్నారు.

## మనస్థాపానికి గురై వ్యక్తి మృతి



- ఎస్సై అపూర్వ రెడ్డి

**నవతెలంగాణ -సిద్దిపేటరూరల్**

భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్థాపానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దెల్లి గారి జగదీష్ (23) రెండు ఏళ్ల క్రితం దుబ్బాక మండలం బల్వంతపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి సుస్మితతో వివాహం జరిగింది. వారికి 8 నెలల క్రితం అమ్మాయి పుట్టింది. పాప మూడు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయింది.అప్పటి నుంచి జగదీష్ తాగుడికి బానిసై ఇంట్లో ఏ పని చేయకుండా తాగుతూ ఇంట్లో రోజు గొడవ పడుతుండేవాడు. 15 రోజుల క్రితం తాగి వచ్చి తన భార్యను సుష్మిత తో గొడవపడ్డాడు. ఆమె తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. పాప చనిపోవడం భార్య పుట్టింటికి వెళ్లడం వలన రోజు బాధ పడుతుండేవాడు . గురువారం సుస్మిత తల్లిదండ్రులు పెద్దమనుషుల సమక్షంలో గొడవ గురించి మాట్లాడి సర్ది చెప్పడానికి వచ్చినారు. కానీ జగదీష్ బాగా తాగి ఉండటం వలన వచ్చే సోమవారం మాట్లాడుకుందామని వెళ్లిపోయినారు. సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి పడుకొని ఉన్నారు. జగదీష్ తమ్ముడు పూర్ణచందర్ ఇంటికి వచ్చేసరికి జగదీష్ చనిపోయి ఉన్నాడు. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్లో సమాచారం ఇచ్చాడు. తల్లిదండ్రులు ఇంటికి వెళ్లి చూడగా జగదీష్ చనిపోయి ఉన్నాడు. పాప చనిపోవడం భార్య పుట్టింటికి వెళ్లడం మనస్థాపానికి గురై పురుగుమందు తాగి జగదీష్ మరణం పై ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి పెద్దిల్లి గారి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం




**నవతెలంగాణ-సిద్దిపేట**

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో తోట విశ్వం శరణ్యాల పెండ్లి రోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు చకిలం రవి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదలకు తమ వంతుగా సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సెక్రెటరీ విశ్వం, శరణ్య, అయితే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను దీవించిన వంటేరు



**నవతెలంగాణ -గజ్వేల్**

గజ్వేల్ పట్టణానికి చెందిన చింత కుమార్ కుమారుని పూలు పండ్లు కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి పాల్గొని వధీవరులను దీవించారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింత శ్రీనివాస్, రవీందర్, స్వామి చారి, హైమద్ పాల్గొన్నారు.

## రుణమాఫీ పేరిట ప్రభుత్వం డ్రామా

- బీజేపీ రాష్ట్ర నాయకులు మనోహర్ రెడ్డి



**నవతెలంగాణ-గజ్వేల్**

రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ప్రారంభించిందని బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రశ్నిస్తున్న అనే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు మాయ మాటలు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. బ్యాంకులో రైతులకు రుణమాఫీ కావడం లేదని చాలామంది రైతులు రోడ్డుపైకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల పంచమి వేడుకలు











**నవతెలంగాణ-కోహెడ**

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా మహిళలు పుట్టలో పాలు పోశారు. నైవేద్యాలు సమర్పించి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని మల్లన్న ఆలయంలో ఉన్న పుట్ట వద్దకు ఉదయం పూట మహిళలు అధిక సంఖ్యలో చేరుకొని పాలు, నైవైద్యం సమర్పించారు. అలాగే ప్రతియేడు పుట్టకు పాలు పోస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. తమ పిల్లాపాపలను సల్లంగా చూడాలని నాగేంద్రుని కోరుకున్నారు. బస్వాపూర్‌లోని పంచముఖ సోమేశ్వరం ఆలయం వద్ద నాగుల పంచమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండ వెంకటస్వామి, సతీష్, మాజీ సర్పంచ్‌లు తాటిపాముల శ్రీనివాస్, వేముల నరేష్, వర్షిణి, పండితులు చందుచారి, సమ్మయ్య, సురేష్, ఆంజనేయులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నవతెలంగాణ- రాయపోల్**

నాగుల పంచమి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌తో పాటు అన్ని గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లోని పుట్టలో పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి రోజున పుట్టలో పాలు పోస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. మండల కేంద్రమైన దౌల్తాబాద్ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి, ఎల్లమ్మ, పోచమ్మ, ఆయా దేవాలయాల్లో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నవతెలంగాణ-దుబ్బాక రూరల్**

నాగుల పంచమిని సందర్భంగా దుబ్బాక మండల వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మండల పరిధిలోని రఘోత్తంపల్లి, రామక్కపేట, పద్మనాభుని పల్లి, తిమ్మాపూర్ ఇతర గ్రామాల్లోని ఎల్లమ్మ దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమి పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని పుట్టలో మహిళలు పాలు పోసి మొక్కలు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది నాగుల పంచమి రోజున ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. నాగుల పంచమి రోజున పుట్టలో పాలు పోయడం ద్వారా నాగ దోషాలు తొలుగుతాయని విశ్వసిస్తారన్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే వారికి ఎవరికి ఎలాంటి ప్రాణహాని పాముల ద్వారా కలగవద్దని ఉద్దేశంతో ప్రత్యేక పూజలు నిర్వహించారని తెలిపారు. ఆలయాల వద్ద మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో ఉన్నారు

**నవతెలంగాణ-కొండపాక**

శ్రావణ శుక్రవారం నాగుల పంచమి కలిసి రావడంతో శుక్రవారం మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో ప్రారంభం కాగా అమ్మవారికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరిం చారు. అనంతరం సంతాన మల్లికార్జున స్వామి వారికి లఘున్యాస పూర్వకంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు రాహుకాల పూజ భక్తీ శ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి పంచామృత ఫలరస అభిషేకం జరిగింది. తదనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు గట్టు విఠల్ నర్సింహా రెడ్డి మర్యాల రవీందర్ తిరుపతి రెడ్డి చీకోటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ -గజ్వేల్**

హిందువుల పవిత్రమైన నాగుల పంచమి పురస్కరించుకొని వినూతనంగా కర్బుజ కాయ మీద శివలింగం, త్రిశూలం, నాగ దేవత చిత్రాలను అత్య అద్భుతంగా చిత్రించి శుక్రవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి భక్తిని చాటుకున్నారు. గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఉదయమే భక్తి శ్రద్ధలతో గుడికి వెళ్లి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం అంతా కూడ భక్తులు భగవన్నామ స్మరణలో గడుపుతారన్నారు. గత ఏడాది అవాలతో చిత్రించానన్నారు.

**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గ్రామంలో నాగుల పంచమి సందర్భంగా గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున భక్తులు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి పుట్టలో పాలు పోసి నాగదేవతను పూజించినారు. మహిళలు పండ్లు, పువ్వులు పసుపు కుంకుమ వేసి మంగళ హారతితలు ఇచ్చి నైవేద్యం సమర్పించి నాగదేవత మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ నాగ దేవతకు పూజలు చేస్తే కోరిన కోరికలు నెరవేరుతాయి అని భక్తుల విశ్వాసం అని అన్నారు. నాగుల పంచమి సందర్భంగా ఆ నాగదేవత ఆశీస్సులు అందరిపై ప్రసరించాలని, వారి కృపతో అష్టైశ్వర్యాలు సిద్ధించాలని కోరుకుంటూ చెరువులు, వాగులు, కుంటలు నీటితోనుంచి పంటలు బాగా పండాలని భక్తులు కోరారు.

**నవతెలంగాణ-సిద్దిపేట**

నాగుల పంచమి సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సిద్దిపేటలోని గాడిచెర్లపల్లిలో ఉన్న నాగ దేవత దేవాలయాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ దర్శించుకొని, ప్రతేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండలని అమ్మ వారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ గుడికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్నదని అన్నారు. సిద్దిపేట ప్రజలే కాకుండా ఇతర రాష్ట్ర, జిల్లాల నుంచి ప్రజలు వచ్చి అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కులు తీర్చుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి, ముద్దంలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-రాయపోల్**

శ్రావణమాసంలో వచ్చే శుక్ల పక్ష పంచమని నాగుల పంచమిగా లేదా నాగుల చవితిగా పిలుస్తారు. శుక్రవారం నాగుల చవితి సందర్భంగా రాయపోల్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఎన్ని గ్రామాలలో మహిళలు పిల్లలు శివాలయాలు నాగదేవత దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయపోల్ మండల కేంద్రంలో ఉమామహేశ్వర దేవాలయం, నాగులమ్మ దేవాలయం వద్దగల పుట్టలలో పాములకు పాలు పోసి పూజలు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ బద్దంగా ముస్తాబయి ప్రత్యేక తీర్థ ప్రసాదాలు పిండి వంటకాలు తయారుచేసి నాగుల పంచమి వేడుకలు నిర్వహించుకున్నారు.

**నవతెలంగాణ-మర్కుక్**

మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి పుట్టలో పాలు పోసి నాగదేవతకు మొక్కులు చెల్లించారు. పూలు, పండ్లు, నైవేద్యాలు, పసుపు, కుంకుమలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నవతెలంగాణ-నంగునూరు**

శ్రావణమాసం పురస్కరించుకొని శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దేవాలయ సమీపంలో గల పుట్టల వద్ద మహిళలు పాలు పోసి పూజలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నవతెలంగాణ-సిద్దిపేట**

అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా లలితా పరమేశ్వరి అమ్మవారికి, అష్టలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కృపాకరాచార్యులు తెలిపారు. దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి, భక్తులు ఓడి బియ్యం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో అష్టలక్ష్మి హెూమాలు, సామూహిక చక్ర సహిత కుంకుమార్చనలు జరుగుతాయని, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.









# ఒంటరి మహిళ అదృశ్యం

- అచూకి కోసం వేతకవద్దంటూ లేఖ



**నవతెలంగాణ-బెజ్జంకి**

ఒంటరి మహిళా అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని రేగులపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం జాప స్వప్న(38) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. భర్త జాప లక్ష్మారెడ్డి కొద్దెండ్ల క్రితం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఇద్దరు కూతుల్ల వివాహం చేసింది. గత కొద్దిరోజు లుగా మతిస్థిమి తం కోల్పోయి ప్రవర్తిస్తోందని తెలిపారు. తన అచూకి కోసం ఎవరు వేకతకవద్దంటూ లేఖ రాశి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందంటూ పోలీసులు తెలిపారు. ఇళ్లు విడిచి వెళ్తున్న సమయంలో పసుపు రంగు చీర ధరించిందని, చామనచాయ రంగును పొలివుంటుందని, అచూకి తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్ యందు వివరాలు తెలుపాలని ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

# చెట్లు మానవాళికి జీవనాధారం

**ఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్యారాణి**

**నవతెలంగాణ-కల్హేర్**



చెట్లు మానవాళికి జీవనాధారం అని నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్యారాణి అన్నారు. కల్హేర్ మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని ఆమె శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరు తీరును పరిశీలించి ఆస్పత్రిలోని పరిసరాలను తిరిగి చూశారు. గర్భిణీలకు, రోగులకు అందుతున్న వైద్యం గురించి డాక్టర్‌ను, స్టాఫ్ నర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నివసించే, పనిచేసే చోట చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ముఖ్యంగా జలుబు ,దగ్గు, గొంతునొప్పి, జ్వరం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, శ్వాసకోశ సమస్యలు ,ఆహారం జీర్ణం కాకపోవడం వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగు జ్వరంతోపాటు హైపటైటిస్ లాంటి అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. కలుషిత ఆహారం, మురికి నీరు.. వాటిపై వాలే దోమలే ఈ వ్యాధులకు ప్రధాన కారణమన్నారు. కాబట్టి ప్రజలు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని.. దోమలు పెరగకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలని.. ఇలా చేయడం వల్ల అతిసార వ్యాధి, ఇతర సీజనల్ వ్యాధులు కూడా దూరం చేసుకోవచ్చన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు.జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ అనిల్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ మాణిక్యమ్మ, తెలంగాణ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పద్మశాలి ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు భాస్కర్, స్టాఫ్ నర్సులు,ఏఎన్ఎంలు, డీఈఓ అంజి, ఆశావర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్**

**నవతెలంగాణ-రాయపోల్**



వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం సేవించి వాహనాలు నడపరాదని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే గతంలో వాహనాల పై ఉన్న పెండింగ్ చలానలు వాహనదారుల నుంచి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట ఒరిజినల్ పత్రాలు ఉంచుకోవాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇలాంటి పత్రాలు లేకుండా వాహనాలను నడపరాదని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని, కారు వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలియజేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని ఇచ్చినట్లయితే వాహన యజమానులకు, తల్లిదం డ్రులకు కఠిన శిక్షలు వేస్తావన్నారు. మద్యం సేవించి వాహ నాలు నడపరాదన్నారు. అలాగే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికుల ను ఎక్కించుకొ వద్దన్నారు. ధ్రువప త్రాలు లేని పలు వాహ నాలకు చలానాలు వేశారన్నారు. అలాగే వాహనదారులు ఎవరైనా సరే ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్

**నవతెలంగాణ-తూప్రాన్**



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ పలు వార్డులలో పర్యటించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ అభ్యర్థి తూంకుంట ఆంక్ష రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కమిషనర్ ఖాజా మోహినిద్దీన్, కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా,శ్రీశైలం గౌడ్, జిన్నా భగవాన్ రెడ్డి, చింతల రవీందర్ రెడ్డి, తూప్రాన్ ప్రభుత్వాసుపత్రి అధికారి అమర్ సింగ్, బాణపురం రాజు, చెలిమెల రఘుపతి, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ చింతల మధు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

**నవతెలంగాణ-తూప్రాన్**



పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ జూనియర్ కళాశాలలో కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను పెంచి, ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. మొక్కల పెంపక ద్వారానే ఆక్సిజన్ లభిస్తుందన్నారు. జూనియర్ కళాశాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తన దృష్టికి తీసుకురావాలన్నారు. కళాశాల పరిసర ప్రాంతంలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని అధ్యాపక బృందానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి తూంకుంట ఆంక్షరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ , కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, భగవాన్ రెడ్డి, రవీందర్ గుప్తా, రవీందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ప్రభావతి, అధ్యాపకులు ప్రవీణారాణి, గోవర్ధన్, కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకులు సర్గల నర్సింగరావు,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నాగరాజుగౌడ్, అనిల్, ఉమార్ సిద్దిరాములు గౌడ్ జగ్గ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## సీఐను కలిసి సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-నార్సింగి**

రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకటరాజు గౌడ్‌ను మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది అంచనూరి రాజేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శాంతి పరిరక్షణ కొరకు అందరూ సహకరించాలని సీఐ నాగరాజు గౌడ్ కోరగా, తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అంచనూరి రాజేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా వంజర సంఘం ఉపాధ్యక్షుడు ఎమికె రాజు, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బాచి స్వామి పాల్గొన్నారు.




# ఆదివాసీలు అన్ని రంగాలలో ముందుండాలి

**నవతెలంగాణ-టేక్మాల్**



ఆదివాసీలు (గిరిజనులు) అన్ని రంగాలలో ముందుండాలన్నదే తమ ఆకాంక్ష అని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం టేక్మాల్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ , కొమరం భీం చిత్రపటాలకు జిల్లా బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్ విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గిరిజన వేషాధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ గిరిజన హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించాలని తమకు రావలసిన హక్కులను కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లలిత, మారుతి, నరేందర్, కృష్ణ ప్రసాద్, పాతీమా, సోనీ, రంజిత, రియాన, లాల్ నాయక్,రాజు, శ్రీనివాస్, మోహన్, చంద్రశేఖర్, వసంత్, విఠల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగును పరిశీలించిన వ్యవసాయాధికారి

**నవతెలంగాణ-చిలిపిచేడ్**



తనకున్న 20 గుంటల పొలంలో ఎటువంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులతో నూతనంగా సాగు చేస్తున్నాడు యువరైతు శ్రీనివాస్. ఉన్నతమైన కాకతీయ యూనివర్సిటీలో పత్రిక విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని వ్యవసాయమే ముద్దు అని సేంద్రియ సాగుపై అడుగులు వేస్తున్నాడు శ్రీనివాస్. చిలిపిచేడ్ మండల కేంద్రంలో శ్రీనివాస్ పొలంలో శుక్రవారం వ్యసాయాధికారి బాల్ రెడ్డి సాగును పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ యువ రైతుకు ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. క్రిమి సంహారక మందులు వాడకుండా తన పొలంలో టమోటా, పచ్చి మిర్చి, కాకర , చిక్కుడు మోంటీ ఆకూకూరలు సొరకాయ తదితర పంటలు సేంద్రియ విధానంలో పండిస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. సేంద్రియ సాగు ద్వారా భూమి సారం తగ్గకుండా మంచి ఉత్పత్తి వస్తుందని ఆలాగే జీవన శైలి బాగుంటుందని రైతు శ్రీనివాస్ తెలియజేశాడు.

# భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు







**నవతెలంగాణ-మనోహరాబాద్**

నాగులపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మనోహరాబాద్ మండలంలో దేవాలయాలన్ని భక్తులతో రద్దీగా మారాయి. మహిళలు భక్తి శ్రద్దలతో నాగులపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు దేవాలయాలకు బారులుతీరారు. పుట్టల వద్దకు వెల్లి భక్తితో పాలను పోసి మొక్కలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మనోహరాబాద్ మండల కేంద్రంలోని రేణుకా ఎల్ల దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ర్యాకల కృష్ణాగౌడ్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

**నవ తెలంగాణ-మెదక్ టౌన్**

శ్రావణమాసం మొదటి సందర్భంగా మెదక్ పట్టణంలోని ఆలయాల్లో భక్తులు దర్శించుకుని పాలు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. నాగ పంచమి సందర్భంగా నాగదేవతతో పాటు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నాగ పంచమి రోజున కాల సర్ప దోష నివారణ కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమి సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కట్టకింద హనుమాన్ దేవాలయం వద్ద గల మల్లం చెరువు వద్ద పుట్టలో పాలు పోసి పండ్లు, పసుపు కుంకుమతో నాగదేవతకు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా ముందుగా మహిళలు అందరికీ నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రకళ, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్ జయరాజ్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజాగౌడ్, నాయకులు లింగారెడ్డి ప్రభు రెడ్డి, మధు షాకీర్ తదితరులు ఉన్నారు.

**నవతెలంగాణ-నిజాంపేట**

మండల వ్యాప్తంగా నాగుల పంచమి వేడుకలు మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం నిజాంపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉదయం నుంచి మహిళలు అక్కడి చేరుకుని పుట్టలో పాలు పోసి నాగదేవతకు మహిళలు అభిషేకాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పుట్టలో పాలు పోసి పాలను తోడబుట్టిన అన్నదమ్ములకు కళ్లు కడిగితే మంచి జరుగుతుందని పూర్వకాలం నుంచి వస్తున్న ఆనవాయితీగా భావిస్తారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ నాగుల పంచమి సందర్భంగా ఎల్లమ్మల ఆలయాల వద్దకు మహిళలు భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోస్తారని తెలిపారు. మండల గ్రామ ప్రజలకు నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులకు రుణమాఫీ ఇవ్వకుంటే ఆందోళన

**బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్**

**నవతెలంగాణ -పాపన్నపేట**



పట్టాదార్ పాస్ బుక్కులు ఉన్న రైతలందరికీ రుణమాఫీ ఇవ్వకుంటే ఆగస్టు 15 తర్వాత కలెక్టరేట్లను ముట్టడిస్తామని బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో కిసాన్ మోర్చ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ పేరుతో డ్రామాలు ఆడుతుందన్నారు. అర్హులైన అనేక మంది రైతులకు మాఫీ రాలేదన్నారు. బాధిత రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని వాపోయారు. రేషన్ కార్డులో ఉన్న ఒక్క వ్యక్తికి మాత్రమే రుణమాఫీ చేయడం తగదన్నారు. బాధితుల నుంచి వారు వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బీకొండ రాములు, కిసాన్ మోర్చ అధ్యక్షులు సిద్ధిరాములు, నిజాంపేట మాజీ జెడ్పీటిసి పంజా విజయ్కుమార్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మదు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి. కిసాన్ మోర్చ ప్రధాన కార్య దర్శి ఏసు రెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.